Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 273 మేడ్చల్ మల్కాజ్‌గిరి 22 అక్టోబర్ 2023 ఆదివారం పేజీలు : 4

## బంగాళాఖాతంలో అల్పవాయు పీడనం

చెన్నై : గత జూన్‌లో ప్రారంభమైన నైరుతి రుతుపవన ప్రభావిత వర్షాలు ముగిశాయి. ఇక ఈశాన్య రుతు పవనాలు రెండు రోజుల్లో రాష్ట్రంలో ప్రవేశించను న్నాయని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు. అదే సమయంలో బంగాళా ఖాతంలో అండమాన్ దీవులకు సమీపంలో అల్ప వాయు పీడనం ఏర్పడిందని, అది క్రమంగా బలపడి రెండు మూడు రో జులలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వాయుగుండం తుఫానుగా మారుతుందో లేదో ఇప్పటి కిప్పుడు అంచనా వేయలేమన్నారు. ఓ వైపు ఈశాన్య రుతుపన వనాల ఆగమనం, మరో వైపు ఈ వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో భారీగా వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈ నెలాఖరు నుంచి ఈశాన్య రుతుపవనాలు బలపడి రాష్ట్రవ్యాప్తంగా చెదురుముదురుగా వర్షాలు కురుస్తాయన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు

# డిసెంబర్ టెన్షన్!




హైదరాబాద్/అమరావతి : తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు, అందులో రాజకీయాలు చేస్తున్న పార్టీలకు ఈసారి డిసెంబర్ నెల చాలా కీలకంగా మారబోతోంది. డిసెంబర్ నెలలో చోటు చేసుకుంటాయని భావిస్తున్న పరిణామాలే ఇందుకు కారణం. ఈ పరిణామాలు కచ్చితంగా వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉండటంతో రాజకీయ పార్టీల్లో ఆ మేరకు టెన్షన్ పెరుగుతోంది. దీంతో డిసెంబర్ నెలలో ఇరు రాష్టాల్లో చోటు చేసుకుంటాయని భావిస్తున్న పరిణామాలపై ఓ విశ్లేషణ. ముందుగా తెలంగాణలో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి.

దీని ఫలితాలు డిసెంబర్ లో వెలువడనున్నాయి. ఈ ఫలితాల కోసం ప్రస్తుతం తెలంగాణలో యాక్టివ్ గా ఉన్న అధికార బీఆర్ఎస్, విపక్ష కాంగ్రెస్, బీజేపీ వంటి పార్టీలు ఎదురుచూస్తున్నాయి. తెలంగాణ ఇచ్చే ఫలితం ఆధారంగా ఏపీలోనూ రాజకీయాలకు పదునుపెట్టేందుకు జాతీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కాంగ్రెస్ దూకుడుకు కళ్లెం పడొచ్చు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మాత్రం ఏపీ సహా పలు రాష్ట్రాలపై ప్రభావం తప్పదు. బీజేపీ అధికారంలోకి రాకపోయినా ఎన్నికల్లో టీడీపీ అండ లభిస్తే ఆ ప్రభావం ఏపీపై పడటం ఖాయం. ఏపీలో మూడు రాజధానుల ప్రక్రియలో భాగంగా కార్యనిర్వాహక రాజధానిని అమరావతి నుంచి విశాఖకు మార్చేందుకు ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే ముందుగా సీఎం జగన్ విశాఖకు వెళ్తే ప్రయోజనం ఉంటుందని వైసీపీ భావిస్తోంది. అందుకే రుషికొండపై ప్రత్యేకంగా క్యాంపు ఆఫీసు కట్టించుకుని మరీ అక్కడికి వెళ్లేందుకు జగన్ సిద్ధమవుతున్నారు. అదే సమయంలో డిసెంబర్ నెలలో సుప్రీంకోర్టులో మూడు రాజధానుల కేసు విచారణ ఉంది. ఇందులో సుప్రీంకోర్టు ఇచ్చే ఆదేశాలు కచ్చితంగా ఏపీ రాజకీయాలపై ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తోంది. ఏపీ రాజకీయాల్లో కీలకంగా మారిన పొత్తుల వ్యవహారం కూడా డిసెంబర్లోనే తేలబోతోంది. డిసెంబర్ లో

## టర్నింగ్ పాయింట్ కాబోతోందా !

వెలువడే తెలంగాణ ఎన్నికల ఫలితాల ఆధారంగా ఏపీలో పొత్తులపై బీజేపీ ముందుకెళ్లే అవకాశం ఉంది. ఆ ఎన్నికల తర్వాతే ఏపీలో పొత్తులపై ప్రకటన చేయాలని బీజేపీ భావిస్తోంది. ఒకవేళ బీజేపీ మరోసారి టీడీపీ-జనసేనతో కలిసి ముందుకెళ్లాలని భావిస్తే మాత్రం వైఎస్ జగన్ విషయంలో ఎలా వ్యవహరిస్తుందనేది కీలకంగా మారింది. ఈ టర్నింగ్ పాయింట్ డిసెంబర్లోనే రానుంది. ఏపీలో స్కిల్ కేసులో చంద్రబాబు అరెస్టు తర్వాత జగన్ సర్కార్ వరుసగా కేసులు పెడుతోంది. తద్వారా ఆయన్ని జైలు నుంచి బయటికి రాకుండా చూడాలని భావిస్తోంది. దీంతో టీడీపీ శ్రేణులు డీలా పడతాయని, ఎన్నికల్లోపు చంద్రబాబును జనంలో తిరగకుండా అడ్డుకుంటే చాలనే భావనలో వైసీపీ ఉంది. కానీ చంద్రబాబుపై పెడుతున్న వరుస కేసుల విషయంలో ప్రస్తుతం సుప్రీంకోర్టులో పోరాడుతున్న టీడీపీ.. ఈ వ్యవహారంలో జగన్ సర్కార్ దూకుడు పెంచితే అదే సుప్రీంకోర్టులో మొత్తం కేసుల విషయంలో తాడోపేడో తేల్చుకోవడం ఖాయం.

ఈ లెక్కన డిసెంబర్లో మారే రాజకీయాల్ని బట్టి చంద్రబాబు తీసుకునే నిర్ణయాలు టర్నింగ్ పాయింట్ కావొచ్చు.

# తెలంగాణాలో 'కింగ్‌మేకర్' అయ్యేందుకు టిడిపి మాస్టర్ ప్లాన్!

హైదరాబాద్ : తెలంగాణా ఎన్నికలు ఇపుడు టీడీపీ ఆశావహంగా కనిపిస్తున్నాయని అంటున్నారు. తెలంగాణా రూట్ మీదుగా ఏపీకి వచ్చి వచ్చే ఏడాది జరిగే ఎన్నికలను సానుకూలం చేసుకోవాలన్నది బాబు మార్క్ ఎత్తుగడ. నిజానికి 2018లో కూడా అలాగే చేయాలని అనుకున్నారు. అందుకే కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని టీడీపీ అక్కడ పోటీకి దిగింది. అయితే బీయారెస్ వేసిన తెలంగాణా సెంటిమెంట్ పాచిక పారడంతో టీడీపీ చిత్తు అయింది. ఆ తరువాత బీయారెస్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ కూడా ఏపీలో ఒక లెవెల్ లో తగిలి 23 సీట్లకే పరిమితం అయిపోయింది. ఇక ఈసారి మాత్రం తెలంగాణాలో కలసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుని ఎన్నో కొన్ని సీట్లు గెలవాలని టీడీపీ ఆలోచిస్తున్న సంగతి తెలిసిందే. చంద్రబాబు బయట ఉన్నపుడు కూడా ఖమ్మంలో భారీ మీటింగ్ నిర్వహించారు. ఆ తరువాత హైదరాబాద్ నడిబొడ్డున మరో మీటింగ్ ని నిర్వహించారు. బాబు లెక్కలేంటి అంటే రెండు సార్లు అధికారంలో ఉన్న బీయారెస్ మీద యాంటీ ఇంకెంబెన్సీ ఒక లెవెల్ లో ఉంటుందని, ఆ మీదట తెలంగాణా సెంటిమెంట్ అని ఈసారి చెప్పినా వర్కౌట్ కాదని దాంతో గతం లో మాదిరిగా గట్టిగా బరిలోకి దిగితే చెప్పుకోదగిన నంబర్ లో సీట్లు తెచ్చుకోవచ్చు అని. ఆ విధంగానే అంతా అనుకుని బాబు సెట్ చేసుకునేలోగానే జైలు పాలు అయ్యారు. ఇపుడు ఆ సెంటిమెంట్ ని సానుభూతిని ఎన్ క్యాష్ చేసుకునే పనిలో టీడీపీ ఉంది. అందుకే బిగ్




నంబర్ తోనే పోటీకి దిగాలని చూస్తోంది. తెలంగాణాలో జనసేనతో మాత్రమే పొత్తు పెట్టుకుని దిగితే ఎన్నికల తర్వాత హంగ్ ఏర్పడితే కింగ్ కావాలని కూడా చూస్తోంది. అప్పటి పరిస్థితులను బట్టి ఏ పార్టీ మ్యాజికి ఫిగర్ కి దగ్గరగా వస్తుందో ఆ పార్టీకి మద్దతు ఇవ్వడం ద్వారా తెలంగాణా అధికారంలో వాటా తీసుకోవాలని కూడా లెక్క ఉంది అంటున్నారు. ఇక టీడీపీ కనీసంగా పది సీట్లకు తక్కువ లేకుండా ఈసారి గెలవాలని టార్గెట్ పెట్టుకుంది అని అంటున్నారు. ఈ విధంగా గెలిస్తే కనుక రేపటి రోజున హంగ్ ఏర్పడితే తమ పాత్ర చాలా ముఖ్యం అవుతుంది అని భావిస్తోంది. దాత్నో పాటు తెలంగాణాలో పది సీట్లు కనుక గెలిస్తే బాబు అరెస్ట్ జైలు సానుభూతి ఆ మేరకు వర్కౌట్ అయితే ఇక 2024 లో ఏపీలో జరిగే ఎన్నికల్లో తిరుగు ఉండదని కూడా టీడీపీ భావిస్తోంది.

ఒక్కసారి తెలంగాణాలో గేర్ మార్చి తమ సత్తా చాటితే ఏపీలో సైతం టీడీపీ స్పీడ్ ని ఎవరూ అందుకోలేరని కూడా భావిస్తోంది. మొత్తం మీద చూస్తే తెలంగాణా నుంచే ఏపీ రాజకీయాన్ని నరుక్కు రావాలని టీడీపీ అనుకుంటోంది. అంటే గత ఎన్నికల్లో ఎక్కడైతే ఓటమి పాలు అయి ఆ ప్రభావంతో ఏపీలో దెబ్బ తిన్నామో ఇపుడు కూడా దాన్ని సరిచేసుకుంటూ తెలంగాణా నుంచే విక్టరీ సింబల్ ని ఏపీ కి చూపించాలన్నది టీడీపీ వ్యూహం చంద్రబాబు ఎత్తుగడ అంటున్నారు. మరి ఈ విధంగా ఏపీలో వైసీపీని ఉల్టా పల్టా చేయాలంటే జస్ట్ పది సీట్లు వచ్చినా టీడీపీకి చాలు అని అంటున్నారు. ఆ మీదట టీడీపీ దూకుడుని ఏపీలో ఎవరూ అసలు ఆపలేరు అని కూడా ఆ పార్టీ నేతలు ఫిక్స్ అవుతున్నారు. ఇంతకీ తెలంగాణాలో టీడీపీ కి ఉన్న సత్తా ఎంత, బాబు సానుభూతి ఎలా పనిచేస్తుంది అన్నది ఆసక్తిని పెంచే అంశంగానే ఉంది మరి.

## ఈ డ్రామారావు ఫేక్ ప్రచారాల్లో రాటుదేలిండు

హైదరబాద్: మంత్రి కేటీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కౌంటర్ ట్వీట్ చేశారు. "బీజేపీ దగ్గర శిష్యరికంతో ఈ డ్రామారావు ఫేక్ ప్రచారాల్లో రాటుదేలిండు. తెలంగాణలో కాంగ్రెస్ సునామిని చూసి కేటీఆర్‌కి ఏం చేయాలో అర్థం కాక, ఇప్పుడు కోట్ల రూపాయలు పెట్టి ఫేక్ ప్రచారాలకు దిగిండు. నిన్న మొన్నటి దాకా కర్ణాటకలో అధికారంలో ఉన్న వీళ్ల మిత్ర పార్టీ బీజేపీ, 40% కమిషన్లతో రాష్ట్రాన్ని పూర్తిగా దివాలా తీయించింది.



అలాంటి పరిస్థితుల్లో అధికారం చేపట్టిన కాంగ్రెస్ 100 రోజుల్లోపే ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసి, రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి వైపు నడిపిస్తున్నది. ఇప్పుడు తెలంగాణాలోనూ కాంగ్రెస్ దూసుకెళు ంటే, ఇన్ని రోజులు నింపుకున్న జేబులను ఇప్పుడు దులుపుతున్నారు. మీరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా, కోట్లు కుమ్మరించినా, తెలంగాణ ప్రజలు మీ తోడు దొంగల దుమ్ము దులపడం ఖాయం! కాంగ్రెస్ వస్తుంది! తెలంగాణ గెలుస్తుంది" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




# రేవంత్... ఉత్తమ్.. కోమటిరెడ్డి....

# బరిలో ఆ ముగ్గురు

## పార్లమెంటును వదిలి అసెంబ్లీకి పోటీ!

హైదరాబాద్ : తెలంగాణా ఎన్నికలలో ముగ్గురు ఎంపీలు బరిలోకి దిగిపోతున్నారు. 2019 ఎన్నికల్లో తెలంగాణాలో కాంగ్రెస్ తరఫున గెలిచిన ముగ్గురు ఎంపీలూ ఇపుడు అసెంబ్లీ రూట్ లోకి వస్తున్నారు. నిజానికి ఇందులో మల్కాజ్ గిరీ ఎంపీ రేవంత్ రెడ్డి 2018లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడారు. ఆ తరువాత వచ్చిన ఎంపీ ఎన్నికల్లో గెలిచారు. అలాగే చూస్తే హుజూర్ నగర్ నుంచి ఉత్తం కుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి ఆ తరువాత నల్గొండ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఇక నల్గొండ నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి పాలు అయిన కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఆ తరువాత భువనగిరి నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. చిత్రమేంటి అంటే ఈ ముగ్గురూ ముఖ్యమంత్రి సీటు మీద కన్నేశారు. వీరు ఎంపీలుగా ఉండగానే ఎమ్మెల్యే టికెట్లను అధినాయకత్వం కేటాయించింది. మొదటి జాబితాలోనే వీరి పేర్లు ఉన్నాయి. అలా చూస్తే కనుక కోమటి రెడ్డి నల్లగొండ నుంచి రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి, ఉత్తం కుమార్ రెడ్డి హుజూర్ నగర్ నుంచి పోటీ చేయబోతున్నారు. నిజానికి చూస్తే నిబంధలన ప్రకారం వారు ఎంపీ పదవికి రాజీనామా చేయాలి. కానీ ముందు ఎన్నికల్లో గెలిచిన తరువాత ఎపుడైనా రాజీనామా చేయవచ్చు. దాంతో ఎంపీలుగా ఉంటూనే వారు ఎమ్మెల్యేగా మరోసారి పోటీ పడుతున్నారు. ఇక డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వచ్చాక ఎంపీ పదవులకు రాజీనామా చేసినా ఆరు నెలల వ్యవధి కంటే తక్కువ ఉంటుంది కాబట్టి ఉప ఎన్నికలు రావు అనే అంటున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ తెలంగాణాలో అధికారంలోకి వస్తుందని పలు సర్వేలు చెబుతున్నాయి. దాంతో సీఎం రేసులో చాలా మంది ఉన్నారని అంటున్నారు. ముఖ్యంగా ప్రస్తుత పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అందరి కంటే ముందు ఉంటారనడంలో సందేహం లేదు అని అంటున్నారు. ఆయన తరువాత మాజీ పీసీసీ చీఫ్ ఉత్తం కుమార్ రెడ్డి ఉంటారు. ఇక తాను సీనియర్ మోస్ట్ లీడర్ ని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అంటూంటారు. ఆయనకు సీఎం పదవి మీద మోజు ఉంది. ఇలా ముగ్గురూ సీఎం పోస్టు మీద కన్నేసి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దూకుతున్నారు. పార్టీ హై కమాండ్ కూడా వారిని ఆశీర్వదిస్తూ పోటీలోకి దించుతోంది. మొత్తం మీద చూస్తే కాంగ్రెస్ గెలుపు అవకాశాలు ఒక వైపు కనిపిస్తూంటే సీరియస్ గా సీఎం రేసులోని అభ్యర్థులు కూడా రంగంలోకి దిగిపోయారు. సో ఈసారి ఎన్నికలు తెలంగాణా రాజకీయాలతో పాటు కాంగ్రెస్ రాజకీయాలలోనూ హీటెక్కించేలా ఉన్నాయని అంటున్నారు. ఇక ఎంపీలు ముగ్గురూ సీఎం పదవిని టార్గెట్ చేస్తే ఎమ్మెల్యేలుగా పోటీలో ఉన్న వారిలో చాలా మంది సీనియర్ నేతలు కూడా కాంగ్రెస్ గెలిస్తే తమ లక్ ని టెస్ట్ చేసుకోవచ్చు. సో హై కమాండ్ సీనియర్ల ఆశలను ఏ మాత్రం నిరుత్సాహ పరచడం లేదు అన్నది ఇక్కడ చూదాల్సి ఉంది.

# సంపాదకీయం

## యూదులు ఇతరుల రక్తాన్ని తీసుకోరా...

## "తోరా"లో ఏముంది?

ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇరువర్గాలకు చెందిన వందలాదిమంది మృతి చెందగా, లెక్కలేనంతమంది తీవ్ర గాయాలపాలవుతున్న సంగతి తెలిసిందే. హమాస్ ఉగ్రవాదుల దాడుల్లో ఇజ్రాయేల్ ప్రజలు సుమారు 1300 మంది చనిపోయారని చెబుతున్నారు. అదేవిధంగా సుమారు 200 మంది హమాస్ చేతుల్లో బందీలుగా ఉన్నారని అంటున్నారు. మరోపక్క ఇజ్రాయేల్ దాటికి గాజా గజ గజ లాడుతుంది. గాజాపై వితౌట్ గ్యాప్ అన్నట్లుగా ఇజ్రాయేల్ వైమానిక దాడులు చేస్తుంది. ఈ దాడుల్లో ఇప్పటివరకూ ఇప్పటి వరకు 3,200 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 11వేల మంది గాయపడినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మరోవైపు గాజాపై దాడులు ఆపేస్తే బందీలందరినీ విడిచిపెట్టేస్తామని హమాస్ సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు "ఎన్‌బీసీ న్యూస్" కథనం వెల్లడించింది. ఆ సంగతి అలా ఉంటే... హమాస్ దాడుల్లో విపరీతంగా గాయపడిన ఇజ్రాయేల్ ప్రజలకు రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఐతే... యూదులు తమ వైద్యచికిత్సలో ఎవరి నుంచి కూడా రక్తాన్ని తీసుకోరనే విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో ఇందులో ఎంత నిజం ఉంది.. అదే నిజమైతే దీని వెనుక ఉన్న కథ ఏమిటి.. రక్తం ఎక్కించకపోతే క్షతగాత్రుల పరిస్థితి ఏమిటి అనే చర్చ మొదలైంది. వివరాల్లోకివెళ్తే... యూదులు తమ పవిత్ర గ్రంథం "తోరా"లో ఉన్న నియమ నిబంధనలను తప్పక పాటిస్తారు. ఇవి బైబిల్ లోని పాత నిబంధన గ్రంథంలోనివి కావడంతో... మారుతున్న కాలంతో పాటు ఈ నిబంధనలలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అందులో ఇతరుల రక్తాన్ని ఎక్కించుకోవడం ఒకటి! ఎందుకంటే... పూర్వం యూదులు ఈ పనికి అంగీకరించేవారు కాదు! అవును... పాత తరం యూదులు చికిత్స సమయంలో ఎవరి రక్తాన్ని తీసుకునేందుకు ఇష్టపడరు. వారు ఎంత అనారోగ్యంతో ఉన్నాకూడా మరొకరి రక్తాన్ని తమ శరీరంలోకి ఎక్కించడానికి అంగీకరించరు. కారణం... యూదులు.. రక్తాన్ని ప్రాణంతో సమానంగా భావిస్తారు. వేరొకరి రక్తాన్ని తీసుకోవడమంటే వారి ప్రాణాన్ని తీయడమేనని అనుకుంటారు. అయితే... నేటితరం యూదులు మాత్రం ఇతరుల రక్తం ఎక్కించుకుంటున్నారు!

**"తోరా"లో ఏముంది? :** "తోరా" యూదుల పవిత్ర గ్రంథం. తోరా అనే పదం తోహ్-రా నుంచి రూపొందింది. అంటే... నేర్చుకోవడం అని అర్థం! తోహ్-రా అనే పదం బైబిల్ లోని మొదటి ఐదు పుస్తకాలను సూచిస్తుంది. వీటిని పంచగ్రంథం అంటారు. ఇవి జెనెసిస్ (ఆదికాండము), ఎక్సోడస్ (నిర్గమకాండము), లెవిటికస్ (లేవీకాండము), నంబర్స్ (సంఖ్యాకాండము), ద్యూటెరోనమీ (ద్వితియోపదేశ కాండము). "తోరా"ను మోషే రాశాడని చెబుతారు. అందుకే దీనిని "మోషే ధర్మశాస్త్ర గ్రంథం" అని కూడా అంటారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూదులు ఈ పుస్తకం ద్వారానే తమ దేవుణ్ణి స్మరించుకుంటారు. సృష్టి ప్రారంభం నుంచి మోషే మరణం వరకు దేవుడు ప్రజలతో ఎలా వ్యవహరించాడో ఈ పవిత్ర గ్రంథంలో పేర్కొన్నారని వారు చెబుతారు.

# శుద్ధజలానికి సాక్ష్యం



ఖమ్మం : చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. చిన్న పిల్లల నడవడికలో మార్పు తెచ్చి ఇక్కడ అక్షరాలు నేర్పుతున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు. ఇప్పుడు ఆయా కేంద్రాలకు త్వరలో శుద్ధజలం అందనుంది. తొలుత సొంత భవనాలున్న కేంద్రాల్లో మినీ ఆర్వోప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో వాటి వివరాలను సేకరించారు. ఉభయ జిల్లాల్లో ఇందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదకొండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా మరికొన్ని అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. ఇంకొన్ని ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో తగిన వసతులు లేవు. దీంతో కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 'సాక్ష్యం' పథకంలో భాగంగా మినీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ముందుగా సొంత భవనాలు, పిల్లల సంఖ్య అధికంగా ఉన్న కేంద్రాలకు ప్రాధాన్యమివ్వనుంది. అవసరమైన లీటర్ల సామర్థ్యం మేరకు ప్లాంట్లు స్థాపించనుంది. అనంతరం విడతల వారీగా మిగిలిన కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లను సమకూర్చనుంది.

పరిశీలించి ఎంపిక చేస్తాం

సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి

జిల్లాలో సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చి మినీ ఆర్వో ప్లాంట్లకు ఎంపిక చేయనున్నాం. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా రూ.లక్ష అందించనుంది. ఈ నిధులతో ఆర్వోప్లాంట్లతో పాటు కేంద్రాల్లో అవసరమైన వసతులను సమకూర్చనున్నాం. ఇప్పటికే పరిశీలన ప్రక్రియ మొదలైంది. ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలోనే జాబితా రూపొందిస్తాం.

# జెండా పాట.. నష్టాల మూట..!



ఖమ్మం : ఖమ్మం మార్కెట్‌లో మిర్చి రైతులు దగా పడుతూనే ఉన్నారు. పలికిన జెండా పాటకు ఏకంగా రూ.5వేలు తగ్గించి వ్యాపారులు మిరపను కొనుగోలు చేయటంతో అన్నదాతలు లబోదిబోమన్నారు. గిట్టుబాటు ధర దొరుకుతుందనే కొండంత ఆశతో మార్కెట్‌కు వస్తే కొనుగోళ్ల మాయాజాలంతో నష్టాల మూట గట్టుకుని తిరుగుపయనమయ్యారు.

నెల రోజులుగా ఇదే తంతు..!

ఖమ్మం విపణికి నెల రోజులుగా మిర్చి రాక క్రమేణా పెరుగుతూ వస్తోంది. ఇటీవల ఒకరోజు మార్కెట్‌కు అత్యధికంగా సుమారు 70 వేల బస్తాల మిర్చిని రైతులు తీసుకొచ్చారు. మంగళవారం దాదాపు 50 వేల బస్తాల సరకు వచ్చింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలతో పాటు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి మిరపకాయలను రైతులు తీసుకొచ్చారు. మార్కెట్ అధికారులు జెండా పాటను రూ.23వేలు, నమూనా రకం మిర్చికి రూ.21వేలు, కనిష్ఠ ధర రూ.18వేలుగా నిర్ణయించారు. ధరలను వ్యాపారులు అమాంతం తగ్గించటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. నాణ్యత, తేమ శాతాన్ని సాకుగా చూపి వ్యాపారులు రూ.18వేల నుంచి రూ.21వేల వరకు కొన్నారు. అత్యధిక మంది రైతులు క్వింటాకు రూ.5 వేల వరకు నష్టపోయారు.

మోసగించటమే ఎ'జెండా'..

మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్న నమ్మకంతో వస్తే.. ఇక్కడ కొనుగోళ్లు సాగుతున్న తీరుతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు కన్నీరుమున్నీరయ్యారు. సాకులు చూపుతూ ధరలు అమాంతం తగ్గించేస్తున్నారని వాపోయారు. ఇటీవల జెండా పాట అత్యధికంగా రూ.25వేల వరకు పలికింది. ఈనెల 11న రూ.24,500, 13న రూ.23,700, 17న రూ.23,500 పలికిన ధర మంగళవారం రూ.23వేలకు పరిమితమైంది. అసలే జెండా పాట దక్కడం లేదన్న బాధతో ఉంటే.. రోజురోజుకూ జెండా పాట పడిపోతుండటం రైతులను మరింత కుంగదీస్తోంది. చేసేదేమీ లేక వ్యాపారులు అడిగిన ధరకే సరకును విక్రయిస్తూ నష్టాలు మూటగట్టుకుని వెనుదిరుగుతున్నారు. పది క్వింటాళ్ల మిర్చి తీసుకొచ్చాను. జెండా పాట ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాట ధర దక్కలేదు. అనేక సాకులు చెప్పి ధర రూ.18,700గా నిర్ణయించారు. తీసుకొచ్చిన మిర్చితో మళ్లీ ఇంటికి వెళ్లలేక అమ్మేశాను. మంచి ధర దక్కుతుందని చాలాదూరం నుంచి వస్తే చివరకు నష్టమే మిగిలింది. వీరబోయిన యలమంచి, సర్వారం, మోతె మండలం, సూర్యాపేట జిల్లాఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధర ఆశాజనకంగా ఉందని అద్దె వాహనంలో 20 బస్తాల సరకు తెచ్చాను. ఒక్కో బస్తాకు రూ.100 రవాణా ఖర్చు అయింది. తీరా ఇక్కడికి వచ్చాక జెండా పాట రూ.23వేలు ఉంటే.. నా మిర్చి రూ.19వేలు మాత్రమే పలికింది. నాణ్యత కలిగిన సరకే అయినా ఒక్కో క్వింటాకు రూ.4వేలు తగ్గించి కొనటంతో తీవ్రంగా నష్టపోయాను. జగన్మోహన్‌రావు, మిరప రైతు, జగ్గయ్యపేట

# చెప్పేదొకటి.. ఇచ్చేదొకటి..!



ఇల్లెందు : భగభగమండే ఎండల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటూ బొగ్గు గనుల్లో సింగరేణి అద్దె వాహనాల మోటరు కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా వారి శ్రమకు తగిన వేతనం అందటం లేదు. సింగరేణి యాజమాన్యం టెండర్ ద్వారా నడిపిస్తున్న బొలెరోలు, క్యాంపర్లు, నీటి ట్యాంకర్లు, అంబులెన్స్‌లు, లారీల వంటి అద్దె వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్న మోటరు కార్మికులకు స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నా.. బిల్లులు మంజూరై యజమాని నుంచి డ్రైవర్ చేతికి అందేసరికి వేతనాలు కోతలకు గురవడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సింగరేణి వ్యాప్తంగా అద్దె వాహనాల మోటరు కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల్లో గాడీల యజమానులే కక్కుర్తి పడుతుండటం గమనార్హం. డ్రైవర్ల ఏటీఎం కార్డులను వాహనాల యజమానులు తమ దగ్గర ఉంచుకుంటున్నారంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నెల రోజులకు చెల్లించాల్సిన వేతనం.. బిల్లు మంజూరై డ్రైవర్ చేతికి అందే వరకు సుమారు 50 రోజులు పడుతోంది. ఈ విధంగానూ డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధైర్యం చేసి తమ గోడు వినిపిద్దామనుకుంటే మరుసటి రోజు విధుల నుంచి తొలగిస్తారేమోననే భయం వారిని వెంటాడుతోంది. ప్రత్యామ్నాయ మార్గం లేక చాలీచాలని వేతనంతోనే విధులు నిర్వర్తిస్తున్నారు.సింగరేణి యాజమాన్యం అద్దె వాహనాల డ్రైవర్లను స్కిల్డ్ కార్మికులుగా గుర్తించింది. రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తే రూ.671 వేతనమిస్తుంది. ఇలా నెలలో 26 రోజులు ఎనిమిది గంటలు విధులు నిర్వర్తించే వారికి రూ.17,446 చెల్లిస్తుంది. అయితే వాహన యజమానులు మాత్రం ఆ వేతనంలో కోతలు పెడుతూ.. ఎనిమిది గంటలు పనిచేసే కార్మికుడికి రూ.12వేల నుంచి రూ.13వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. రోజుకు 12 గంటలు విధులు నిర్వర్తించే వారికి నెలకు రూ.26,156 చెల్లించాల్సి ఉండగా రూ.18 వేలు మాత్రమే ఇస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు.ఇవీ డ్రైవర్ల సమస్యలు.. నెలకు 26 రోజులు డ్యూటీ చేయాల్సి ఉన్నా 30 రోజులు విధులకు హాజరవ్వాల్సిన పరిస్థితి.వాహన యజమానులు యాక్టింగ్ డ్రైవర్లను నియమించడం లేదు.బోనస్‌లు, యూనిఫామ్స్ లేవు.వీటీసీ, మెడికల్ చెకప్ ఖర్చులను డ్రైవర్లే భరిస్తున్నారు. ప్రతినెలా 1న అందాల్సిన వేతనం.. పది నుంచి 20 రోజుల తర్వాత అందుతోంది.సింగరేణి అద్దె వాహనాల డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు అందజేస్తున్నాం. వారి వేతనాల్లో కోతలుంటాయనే విషయం మా దృష్టికి రాలేదు. మోటరు కార్మికులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. షాలేము రాజు, ఏరియా జీఎం, ఇల్లెందు

# రెండు నెలలైనా తేలని ప్రీతి అంశం

వరంగల్ : కాకతీయ మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం (అనస్తీషియా) వైద్యవిద్యార్థిని డాక్టర్ దారావత్ ప్రీతి ఆత్మహత్యకు సంబంధించిన కేసు ఇప్పటి వరకు ఎటూ తేలలేదు. గత ఫిబ్రవరి నెల 22న ఎంజీఎం ఆసుపత్రిలోని అత్యవసర శస్త్రచికిత్స విభాగంలోని విశ్రాంతి గదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గదిని అదే రోజు మట్టెవాడ పోలీసులు సీజ్ చేసి విచారణ చేస్తున్నారు. పలుమార్లు స్వయంగా పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రీతి పడిపోయిన గదిని పరిశీలించి విచారణ చేశారు. సంఘటన జరిగి 56 రోజులవుతున్నా.. ఇప్పటి వరకు కేసులో ఏలాంటి పురోగతి కనిపించకపోగా, మట్టెవాడ పోలీసులు సీజ్ చేసిన గది తాళాలను తొలగించి ఎంజీఎం అధికారులకు అప్పగించారు. ఈ కేసును పోలీసులు ఎటు తేల్చకుండానే గది తాళాలను ఎంజీఎం అధికారులకు అప్పగించడంపై వైద్యవర్గాలు, గిరిజన సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గదిని సీజ్ చేసిన పోలీసులు తాళాలు ఆసుపత్రి అధికారులకు అప్పగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో ఇప్పటివరకు పోలీసులు ఏం చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పీజీలు, సిబ్బందికి అత్యవసర చికిత్స కోసం ఆ గది అవసరమైనదని, అందుకే తాళాలు అప్పగించినట్లు మట్టెవాడ పోలీసులు పేర్కొన్నారు.

# గుట్టుగా తరలుతున్న ఖనిజం..!

మహబూబాబాద్ : కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినా అక్రమార్కులు బైరటీస్ తరలింపు మానడం లేదు.. కంచెను ఛేదించుకొని మరీ అక్రమానికి పాల్పడుతున్నారు. గార్ల మండలం పోచారం, బాలాజీతండా, కోట్యానాయక్‌తండా పంచాయతీ పరిధిలో మూతపడిన బైరటీస్ మైనింగ్ ప్రాంతాల నుంచి కొంత మంది అక్రమార్కులు ఖనిజాన్ని రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి అయితే చాలు విలువైన ఖనిజం ఉన్న గుట్టకు చేరుకొని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి సమయంలో భద్రతను పెంచి ఖనిజం తరలింపునకు చెక్ పెట్టాలని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడేళ్ల నుంచి ..

ఈ ముడి ఖనిజాన్ని పెట్రోల్ శుద్ధి, రంగుల తయారీ, తదితరాలకు వినియోగిస్తారు. దీనిపై అక్రమార్కులు కన్నుపడింది. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ మైనింగ్ ప్రాంతానికి వాహనాలు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు తవ్విన కందకాలను సైతం పూడ్చి ఖనిజాన్ని దోచుకుంటున్నారు. మూసేసే సమయంలో గుట్టపై అక్కడక్కడ వదిలేసిన ఖనిజ కుప్పలను కాజేస్తున్నారు. మూడేళ్ల కిందట బైరటీస్‌ను ఆ ప్రాంతంలోని ఓ వ్యక్తి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా



తరలిస్తుండగా అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. ఇటీవల కొంత మంది అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నట్లు సమాచారం. రాత్రి వేళల్లో టిప్పర్ల, ట్రాక్టర్ల ద్వారా కాకినాడకు పంపిస్తున్నారు. అక్కడి నుంచి వారు అనుకున్న చోటుకు చేర్చుతున్నారు. టిప్పరు ఖనిజాన్ని రూ. 8 లక్షలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

పరిశ్రమ పునరుద్ధరిస్తే

పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి పరిశ్రమ పునరుద్ధరణ చేపట్టాలి. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా నిరుద్యోగులకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయని వారిని దృష్టిలో పెట్టుకుని పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం-రమేశ్, డీఆర్వో

రాత్రి పూట నిఘా ఉండేలా వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలంటూ జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపించాం. ఎవరైనా ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తే గుర్తించి చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పట్టుబడిన వారి యొక్క భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలను స్వాధీనం చేసుకుంటాం. కేసులు నమోదు చేస్తాం.

# కొత్త వారికి అవకాశం లేదు!

జగిత్యాల : పెంపకందారులకు రాయితీపై గొర్రెల యూనిట్లను పూర్తిస్థాయిలో అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 22,674 మంది గొర్రెల కాపరులను గుర్తించగా వీరిలో 292 సంఘాల పరిధిలో 21,067 మందికి రాయితీపై గొర్రెలను ఇవ్వాలని సంకల్పించారు. ఇందులోనూ తొలివిడతలో 2017-18 ఆర్థిక సంవత్సరంలో 10,557 మందిని ఎంపికచేయగా 9,756 మంది డీడీలను తీసిచ్చి గొర్రెలను తీసుకున్నారు. డీడీలు తీసివ్వనందున 801 మందికి గొర్రెలను పంపిణీ చేయలేదు. జిల్లాలో రెండో విడతలో 10,510 యూనిట్లను గుర్తించగా 7,694 మంది డీడీలను తీసిచ్చారు. వీరిలో 5,198 మందికి యూనిట్లను పంపిణీ చేసిన తరువాత 2018 చివర్లోనే పథకాన్ని ఆపివేశారు. 21 గొర్రెలతో కూడిన ప్రతి యూనిట్ పూర్తిధర రూ. 1.25 లక్షలుండగా



ప్రభుత్వ రాయితీ రూ.93,750 పోను లబ్ధిదారులు రూ.31,250 చొప్పున చెల్లించారు. పథకాన్ని ఆపివేసే సమయానికే జిల్లాలో 2,496 మంది తమవంతు మొత్తాన్ని చెల్లించారు. కాగా రెండేళ్లక్రితం యూనిట్ ధరను రూ.1.75 లక్షలకు పెంచటంతో మిగిలిన 2,496 మంది ఒక్కో యూనిటుకు తమవంతుగా మళ్లీ రూ.12,500 చొప్పున అదనంగా రూ.3.12 కోట్లను చెల్లించాల్సి వచ్చింది. వీరికి గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. జిల్లాలో రెండోవిడతలో 2,816 మంది డీడీలను తీసివ్వలేదు.

ప్రస్తుతం రూ.1.75 లక్షల యూనిట్ విలువలో రూ.43,750 మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.1,31,250 రాయితీగా ఉంది. జిల్లాలో రెండు విడతల్లో కలిపి 3,617 మంది గొర్రెలు అందని వారున్నట్లుగా అధికారులు గుర్తించి ప్రస్తుతం వీరినుంచి డీడీలను తీసుకుంటుండగా ఇప్పటివరకు 250 మంది వరకు తమవంతు వాటా మొత్తానికి డీడీలు తీసిచ్చారు. మరోవైపు 2017 సంవత్సరంలో ఎంపికచేసిన జాబితాలోని వారికే ప్రస్తుతం అవకాశం ఇస్తున్నారు. నూతనంగా పెంపకందారులకు పథకంలో అవకాశం కల్పించనందున దాదాపుగా 1,500 మంది వరకు నిరాశగా ఉన్నారు. ఐదేళ్లక్రితం తక్కువ ధరలో గొర్రెలు తీసుకున్నవారికి ఇప్పటిదాకా మంద పెంపు జరగగా తాము అధికధర చెల్లించాల్సి రావటం, ఐదేళ్లు ఆలస్యంగా గొర్రెలను ఇవ్వటంతో లబ్ధికలగదని, రాయితీని పెంచాలని పెంపకందారులు కోరుతున్నారు. మరోవైపు గత విడతల్లో పలుచోట్ల పంపిణీ అవకతవకలు జరగగా ఈ సారి పక్కాగా పంపిణీ చేయాల్సిఉంది. 2017 జాబితాలోని దాదాపు 50 మంది వరకు మృతిచెందగా వీరి భార్య లేదా కుమారులను పథకంలో చేర్చేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. జాబితాలోగల మిగిలినవారు తమవంతు వాటా మొత్తానికి డీడీలను తీసివ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకలనుంచి గొర్రెలను తెచ్చి లబ్ధిదారులకు అందించనున్నట్లు వివరించారు.

## స్టేడియంలో ఆడేదెప్పుడో?

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మినీ స్టేడియం నిర్మాణ పనులు తొమ్మిదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఏళ్ల గడుస్తున్నా పనులు పూర్తి కాక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. సాధన కోసం పట్టణ శివారు ప్రాంతాలను గానీ, జూనియర్ కళాశాల మైదానాన్ని గానీ ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. స్టేడియం పూర్తయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించిన క్రీడాకారులకు నిరాశ తప్పడం లేదు.వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ శివారులో అయిదు ఎకరాల విస్తీర్ణంలో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.1 కోట్లను మంజూరు చేసింది. 2014 సంవత్సరంలో స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో కలిసి అప్పటి శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు ఆగుతూ, సాగుతూ తొమ్మిదేళ్లు అయినా పూర్తి కాలేదు. మొదట వీటిని చేపట్టిన గుత్తేదారు మధ్యలో చేతులెత్తేయడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక నిధులు రూ. 5 కోట్లు మంజూరు చేయడంతో తిరిగి పనులు మొదలయ్యాయి. క్రీడాకారులకు అవసరమైన విశ్రాంతి, డ్రెస్సింగ్, క్రీడా పరికరాలు భద్రపరిచేందుకు, కార్యాలయం తదితర గదుల్లో ఫ్లోరింగ్ పనులు కొనసాగుతున్నాయి. స్టేడియం చుట్టూ ప్రహరీ పూర్తి చేశారు. విద్యుత్తు వైరింగ్ తదితర వాటిని చేపట్టాల్సి ఉంది. మైదానంలో మొరం నింపి చదును చేశారు. ఆర్చిగేటు నిర్మాణం, మరికొంత ప్రాంతం మొరం నింపాల్సి ఉంది. ఇండోర్‌గేమ్ భవనం, మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణం వంటివి పూర్తి చేయాల్సి ఉంది.



క్రీడా మైదానం లేక అవస్థలు

వేములవాడ పట్టణవాసులు, క్రీడాకారులకు మైదానం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానమే అన్నింటికీ పెద్ద దిక్కుగా మారింది. వర్షం కురిస్తే ఆ మైదానం చెరువును తలపిస్తుంది. దీంతో కళాశాల విద్యార్థులు, పట్టణవాసులకు ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. కళాశాల మైదానంలో చాలీచాలని వసతుల మధ్య ఏటా పాఠశాల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మైదానం లేక ఇతర క్రీడల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. కళాశాల పని వేళల్లో క్రీడల నిర్వహణకు ఎలాంటి అవకాశం లేదు. దీంతో పట్టణ శివారు ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి క్రీడాకారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రాంతంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ తదితర క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించిన వారు చాలా మంది ఉన్నారు. క్రీడా మైదానం అందుబాటులో లేక నైపుణ్యాలను మెరుగుపరచుకోలేకపోతున్నారు. పట్టణవాసులు నడకకు సైతం మైదానం లేక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో తిరుగుతున్నారు. ఇప్పటికైనా స్టేడియం నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు, క్రీడాకారులు కోరుతున్నారు.

మరో ఎనిమిది నెలల్లో పూర్తి

నిలిచిపోయిన స్టేడియం నిర్మాణ పనులు మొదలు పెట్టి మూడు నెలలు అవుతుంది. అగ్రిమెంట్‌లోగా పనులు పూర్తి చేయడం జరుగుతుంది. ఇండోర్ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మైదానంలో సింథటిక్ ట్రాక్, భవనంలో ఫ్లోరింగ్, ఆర్చిగేటు తదితర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గుత్తేదారుకు బిల్లుల చెల్లింపునకు ఇబ్బంది లేదు. పనులు నిలిచిపోవడానికి అవకాశం లేదు. నిర్ణీత గడువులోగా స్టేడియం నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తుంది.
శ్రీకాంత్, ఏఈ, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ, వేములవాడ

## అందుబాటులో నిధులు.. ఆసుపత్రుల్లో ప్రజలు

ధర్మారం : 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందాన మారింది ధర్మారం మండలం నందిమేడారం వాసుల దుస్థితి. అందుబాటులో నిధులున్నా వినియోగించుకోలేక, వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జాప్యం.. పనుల్లో నాణ్యత లేదనే ఫిర్యాదులతో అధికారులు ఆచితూచి వ్యవహరిస్తుండటం శాపంగా మారింది.

నందిమేడారం పంచాయతీలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. గ్రామంలోని అంతర్గత రహదారులపై గుంతలు పూడ్చేందు కు.. కాలువలు, ప్రాజెక్టు పనులు చేస్తున్న చోటు నుంచి మట్టి, చూర తెచ్చి పోస్తున్నారు. మండల అధికారులు చెక్కులు పాస్ చేయనందుకే పారిశుద్ధ్య పనులు చేయలేకపోతున్నామని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. పారిశుద్ధ్య లోపంతో దోమలు స్వైర విహారం చేస్తున్నా యి. ప్రజలు విష జ్వరాలు, డెంగీతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

పంచాయతీలో ఎఫ్ఎఫ్‌సీ(రాష్ట్ర ఆర్థిక సంఘం) నిధులు రూ. 22 లక్షలు, సాధారణ నిధులు రూ.లక్ష నిలువ ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి ముజీబ్ తెలిపారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కొత్త పనులు చేపట్టేందుకు వీలు కావడం లేదని చెప్పారు. అయితే చేసిన పనులు సక్రమంగా లేవని, సమగ్ర పరిశీలన అనంతరమే బిల్లులు చెల్లిస్తామని ఎంపీవో రమేష్ తెలిపారు. పారిశుద్ధ్య లోప నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రాణాలు పోతేనే హడావుడి

నందిమేడారం గ్రామానికి చెందిన సిరవేని మైథిలి నెల రోజుల కిందట తీవ్ర జ్వరంతో మృతి చెందింది. ఆ మరుసటి రోజు నుంచి నాలుగైదు రోజులు గ్రామ పంచాయతీ, మండల అధికారులు హడావుడి చేశారు. ప్రభావిత కాలనీలోని ఎస్సారెస్పీ కాలువలో పూడికతీత చేపట్టారు. ఊరిలో నుంచే మరో రెండు ఎస్సారెస్పీ ఉపకాలువలు వెళ్తుండగా వాటిలోనూ పూడిక పేరుకుపోయింది. దీనికితోడు ఎస్సారెస్పీ కాలువల్లోకే మరుగుదొడ్ల పైపులైన్లు కలపడంతో సమస్య తీవ్రమవుతోంది. కాలువల్లో సాగునీటి ప్రవాహం లేకపోగా మరుగుదొడ్ల వినియోగ జలం ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. కాలువలకు ఇరువైపులా ఉన్న కుటుంబాల వారే ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. మేడారంలో కేవలం ఆరుగురే డెంగీ బారిన పడినట్లు వైద్యాధికారులు చెబుతుండగా చాలా మంది బాధితులు ధర్మారం, కరీంనగర్‌లలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

డెంగీ బాధితులకూ స్థానికంగా చికిత్సనందిమేడారం పీహెచ్‌సీలో అన్ని రకాల జ్వర నిర్ధారణ పరీక్షలతో పాటు డెంగీ బాధితులకు చికిత్స అందిస్తున్నా మని మండల వైద్యాధికారి డా.అనుదీప్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన వారికి పారిశుద్ధ్య నిర్వహణపై సూచనలు చేయడం వరకే తమ విధి అని చెప్పారు. డెంగీ బాధితులకు అందిస్తున్న చికిత్సలను బాధితులు సద్వినియో గం చేసుకోవాలని సూచించారు.డా.అనుదీప్, మండల వైద్యాధికారి

# సొంత విత్తు... లాభాల సొత్తు




జగిత్యాల : జిల్లాలో 3.06 లక్షల ఎకరాల్లో ప్రధాన పంటగా పండించిన వరిపంట నూర్పిడి చేపడుతుండగా ఇదే తరుణంలో విత్తన సేకరణకు సమయం అత్యంత అనువుగా ఉంది. సూటిరకాలైన నువ్వులు, వరి, పెసర, మినుము, అలసంద తదితరాల్లో ప్రతిపంటకు రైతులు నూతనంగా విత్తనాన్ని కొనాలన్న ఆలోచనను మార్చాలనే ఉద్దేశంతో 2017 ఏప్రిల్‌లో రాష్ట్రంలోనే తొలిసారిగా జగిత్యాల జిల్లాలో అధికారులు 'మన ధాన్యం – మన విత్తనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.జిల్లాలో నీటిలభ్యతతో వచ్చే యాసంగిలోనూ వరి ప్రధాన పంటగా రైతులు సాగుచేస్తారు. ప్రతి హెక్టారుకు రూ. 2,500 నుంచి రూ. 5,600 వరకు ప్రైవేటు కంపెనీల విత్తనాలకు వెచ్చించాల్సి ఉండగా వరి పండించే రైతుల్లో సగానికిపైగా రైతులు రైతు విత్తనాన్ని వాడుకునే వీలుంది. దీంతో ఒక పంటకు కనీసం రూ. 10 కోట్ల వరకు విత్తన ఆదాచొప్పున సాధారణ పరిస్థితుల్లో రైతులకు రూ. 20 కోట్లవరకు మిగలనుంది. ప్రస్తుతం వానాకాలంలో పండించిన వరిధాన్యంలో నుంచి విత్తన గింజలను తీసుకుని రైతులు యాసంగిలో రైతువిత్తనంగా వాడుకోవచ్చు.

రైతు విత్తనాన్ని వాడుకున్నపుడు కల్తీ, నకిలీల బెడద ఏమాత్రం ఉండదు. మన నేలల్లోనే పండించిన పంట కాబట్టి స్థిరమైన దిగుబడికి అవకాశం ఉంటుంది. విత్తనఖర్చు తగ్గటంతో పాటుగా తోటి రైతులకు విత్తనాన్ని విక్రయించి అధిక ఆదాయం పొందవచ్చు. పొలంపై కల్తీకర్రలు, బెరకు కర్రలను తీసివేస్తూ వేరుగా నూర్పిడి చేసుకోవటం ద్వారా ఎన్ని పంటలకైనా సూటిరకం విత్తనాన్ని రైతు విత్తనంగా వాడుకోవచ్చు. వరితో పాటుగా ఇతర పంటల్లోనూ సొంతవిత్తు లాభాలసొత్తుగా ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొనడాన్ని రైతులందరూ ఆచరించాలి.

రెండు పంటల్లో రూ. 32 కోట్ల వరకు ఆదా
– డి.అశోక్‌కుమార్, వ్యవసాయశాఖ జిల్లా మాజీ సలహాదారు

రైతు పండించిన విత్తనాన్నే అందమైన సంచుల్లోనింపి రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. విలువైన తమ పంటను పూర్తిగా మార్కెట్‌లో అమ్మకుండా సొంతవిత్తనంగా వాడుకోవచ్చు. ఆహార ధాన్యాలు పప్పుదినుసులు, నూనెగింజలు తదితర పంటల్లో రైతువిత్తనం వాడుకుంటే సాలీనా రెండుపంటల్లోనూ రూ. 32 కోట్లవరకు ఆదా అవుతుంది.

ప్రతిగింజా విత్తనమే– డాక్టర్ జి.శ్రీనివాస్, జగిత్యాల పరిశోధనస్థానం

మక్క, కూరగాయలు, పత్తి తదితరాల్లో ఆడ, మగవరుసల్లో గింజలు వేసి విత్తనాలను ఉత్పత్తి చేస్తారు కాబట్టి ఈ సంకరాలను ప్రతిపంటకూ తీసుకోవాలి. కానీ వరి, నువ్వులు, పెసర, మినుము, తదితర పంటల సూటిరకాల్లో రైతులు పండించిన ప్రతిగింజ విత్తనంగా ఉపయోగపడుతుంది. రైతులు హైబ్రిడ్స్(సంకరాలు), సూటిరకాల మధ్యనగల ఈ చిన్న తేడాను గమనించాలి.

# ఓటు పోటెత్తేలా చైతన్యం



పెద్దపల్లి : ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటు హక్కు వినియోగంపై చైతన్యం తెచ్చేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. స్వేచ్ఛాయుతంగా ఓటేసేలా మౌలిక వసతులు, ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రలోభాలకు లొంగవద్దని.. సుపరిపాలనలో 'మన ఓటు' కీలకం.. అనే అంశాలను వివరిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో మహిళలు, ఉద్యోగులు, కార్మికులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొన్ని పర్యాయాలుగా ఉమ్మడి జిల్లాలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే పోలింగ్ శాతం పెరిగినట్లు కనిపిస్తున్నా ఇంకా ఆందోళన కలిగిస్తోంది. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైతేనే ఓటుహక్కుకు సార్థకత చేకూరుతుంది.

క్షేత్ర స్థాయిలో అవగాహన

ఓటరుగా నమోదు, ఓటుహక్కు వినియోగంపై విద్యా సంస్థల్లో క్యాంపస్ అంబాసిడర్లను ప్రభుత్వం నియమించింది.

పాఠశాలల్లో నమూనా పోలింగ్ నిర్వహణ ద్వారా తల్లిదండ్రులు తప్పకుండా ఓటేసే బాధ్యత తీసుకోవాలని విద్యార్థులకు వివరిస్తున్నారు. స్వశక్తి సంఘాల మహిళలు, ఉద్యోగులు, విశాంత్ర ఉద్యోగులు, కార్మికులతో సమావేశాలు ఏర్పాటు నిర్వహిస్తున్నారు.

ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ స్థాయిలో కమిటీలను నియమించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున సంచార వాహనంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లను తరలిస్తూ వాటి పనితీరుపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఊరూరా కళాజాత ప్రదర్శనలు, నాటికల ద్వారా ఓటుహక్కు వినియోగంపై అవగాహన పెంపొందిస్తున్నారు.

ఫలిస్తున్న ప్రయత్నాలు

పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన సంస్కరణలు ఫలిస్తున్నాయి. నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని నియమించి ఓటింగ్ శాతం పెంచేలా సన్నద్ధం చేస్తున్నారు. గతంలో తక్కువగా నమోదైన ప్రాంతాలపై దృష్టి సారించారు. గత ఎన్నికల్లో తొలిసారిగా మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఓటింగ్ శాతం పెరిగింది. దీంతో ఈ సారి యువత, దివ్యాంగులకు ఆదర్శ పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. 80 ఏళ్లు నిండిన వృద్ధులతో పాటు దివ్యాంగులు దరఖాస్తు చేసుకుంటే ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తారు.

బాధ్యత గుర్తెరిగితే మేలు

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో కరీంనగర్, రామగుండంలలో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతోంది. ఓటరు జాబితాలో 40 శాతం వరకు ఉన్న యువత ఓటు వేయడానికి నిరాసక్తత కనబరుస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంలో కార్మికుల కుటుంబాలు ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు. చాలా చోట్ల 30 శాతం కంటే తక్కువగా నమోదవుతోంది. ప్రతి ఓటరూ హక్కు వినియోగించుకునేలా వారిలో బాధ్యత పెంచాలి. నిజాయతీపరులకు అధికారం కట్టబెట్టే ఆయుధం ఓటరు చేతిలోనే ఉందంటూ అందరినీ ఆలోచింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రలోభాలకు గురి చేసేవారిని ప్రశ్నిస్తేనే సుపరిపాలన వస్తుందని ఓటర్లకు నూరిపోయాలి.

# చెత్త సేకరణలో ఇక్కట్లు తొలగేనా..!

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో చెత్త సేకరణను వేగంగా చేపట్టేందుకు మార్పులు రావాల్సిన అవసరముంది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్–2016 నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు మెరుగుపడాలి. ఇప్పటికే తడి, పొడి చెత్తను వేరు చేయడం, వేరు చేసిన చెత్తను డంపింగ్‌యార్డుకు రాకుండా పొడి వనరుల కేంద్రానికి తరలించి అక్కడ విక్రయించే వస్తువులు వేరుచేసి తరలించాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ లేక గాడి తప్పుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజులుగా కమిషనర్ బి.శ్రీనివాస్ రంగంలోకి దిగి డివిజన్ల నుంచే చెత్త సేకరణ వేరుగా చేసేలా పారిశుద్ధ్య విభాగం ఉద్యోగులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం డివిజన్ల వారీగా నివాసిత ఇళ్లు, వాణిజ్య దుకాణాలు రెండూ కలిసి ఉన్నాయి. రెండింటినీ విభజించి చెత్తను తరలించడం వల్ల పనులు సులభతరం కావడంతో పాటు నగరపాలిక ఆదాయ మార్గాన్ని పెంచుకునే వీలుంది. అందులో భాగంగా ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న దుకాణాల నుంచి చెత్తను తీసుకెళ్లడానికి ప్రైవేటు కన్సల్టెన్సీ ద్వారా సర్వే చేయించారు. ప్రతీ దుకాణానికి జియోట్యాగింగ్ చేశారు. 16 రహదారులు 5,117 దుకాణాలునగరంలోని 60 డివిజన్ల పరిధిలో 16 రహదారులను గుర్తించగా ఆ రోడ్లకు ఇరువైపులా ఏడు వేలకు పైగా వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్స్ మాత్రం 5,117 దుకాణాలకు మాత్రమే ఏర్పాటు చేశారు. వీటికి జియోట్యాగింగ్, క్యూఆర్ కోడ్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు మ్యాపింగ్ చేశారు. ప్రైవేటు సంస్థలు, దుకాణాలు, షోరూంలు, ఫంక్షన్‌హాల్స్, హాస్టల్స్, పార్కులు, ఆసుపత్రులు, పెట్రోల్‌బంకులు, సూపర్‌మార్కెట్లు, చర్చిలు, మసీదులు, దేవాలయాలు, పండ్లు, పూల దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, పరిశ్రమలు, మద్యం దుకాణాలు, అతిథి గృహాలు, బ్యాంకులు, గోదాములు, కోల్డ్ స్టోరేజీ పాయింట్స్, స్వీట్ హౌజ్‌లు, బేకరీలు, మల్టీప్లెక్స్, దాబాలు, లాడ్జీలు, స్క్రాప్ దుకాణాలు, కిరాణం దుకాణాలు, చేపలు, మాంసం, చికెన్ షాపులు, ఆటోస్టోర్లు, డయాగ్నోస్టిక్స్, ఫార్మసీ, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాల వంటివి ఉన్నాయి.

నిత్యం సవాలే..వాణిజ్య ప్రాంతంలో చెత్త సేకరణ చేయడం సవాలుగా మారుతోంది. దుకాణాలు తెరుచుకునే సమయానికే చెత్తను తీసుకెళ్లే వారు వచ్చి వెళ్తారు. ఆ తర్వాత చెత్తంతా రోడ్ల మీద వేస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టడంతో పాటు ఏ దుకాణం నుంచి ఎంత మొత్తాన్ని వసూలు చేస్తారనే విషయం తెలియకుండా మారింది. దీనికి విధివిధానాలు ఖరారు చేయడంతో పాటు ప్రతీ దుకాణం నుంచి చెత్త సేకరణ జరుగుతుందా లేదా అనే విషయాన్ని కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా గుర్తించే వీలుంది. తద్వారా పక్కాగా పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి అవకాశముంటుంది.

రీడర్స్ బిగింపులో జాప్యంవాణిజ్య దుకాణాల నుంచి చెత్త సేకరణలో జాప్యం రాకుండా ఉండేందుకు స్మార్ట్‌సిటీలో భాగంగా రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ డివైజ్ (ఆర్ఎఫ్ఐడీ) బిగించారు. దుకాణాల ఎదుట నుంచి చెత్తను ఏ సమయంలో తీసుకెళ్తున్నారు. ఎంత చెత్త వెళుతోంది? చెత్త తీసుకెళ్లిన తర్వాత తెలిసేలా దీనిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయనున్నారు. కాగా రీడర్స్ ఇవ్వకపోవడం, చెత్తను సేకరించే వాహనాల డ్రైవర్లకు స్కానింగ్ పరికరాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ట్యాగ్స్ ఉన్నా వినియోగం లేకుండా పోతోంది. కొందరు వాటిని ఎందుకు అమర్చారనే విషయం తెలియక తొలగిస్తున్నారు. సాంకేతిక పరికరాలు బిగిస్తే ప్రత్యేకంగా వాణిజ్య దుకాణాల నుంచి వ్యర్థాల సేకరణ వందశాతం జరగనుంది.

## రహదారుల విస్తరణ.. వసతులకు పెద్దపీట

ధర్మారం : దినాదినాభివృద్ధి చెందుతున్న ధర్మారం మండలకేంద్రం క్రమంగా పట్టణ రూపును సంతరించుకుంటోంది. ఇప్పటికే ధర్మారం–పెద్దపల్లి రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా తాజాగా కరీంనగర్ మార్గం విస్తరణకు నిధులు మంజూరయ్యాయి. ప్రయాణ ప్రాంగణం అభివృద్ధికి నిధులు వచ్చాయి. ఈ పనులన్నీ పూర్తయితే ధర్మారం పట్టణానికి కొత్త శోభ రానుంది.

ప్రధాన మార్గాల్లో తొలగనున్న కష్టాలు

రెండు వరుసలుగా ఉన్న ధర్మారం–పెద్దపల్లి మార్గంలో పట్టణంలోని ప్రధాన కూడలి నుంచి ఎస్సారెస్పీ డి 83బి కాలువ వరకు నాలుగు వరుసలుగా విస్తరణ, విభాగిని నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నుంచి ఒకసారి రూ. 2 కోట్లు, రెండో విడతలో రూ. 3.10 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. కాగా వరంగల్–రాయపట్నం రాష్ట్ర రహదారిని ధర్మారంలో ఇరువైపులా విస్తరించేందుకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 14.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలో 2.4 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించడంతో పాటు ఇరువైపులా మురుగు కాలువలు, మధ్యలో డివైడరు నిర్మించనున్నారు. కరీంనగర్–రాయపట్నం రహదారి రెండు వరుసలుగా ఉన్నప్పటికీ పట్టణ పరిధిలో స్థానిక వాహనాల రద్దీ కారణంగా, ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తొలగనున్నాయి.

శాశ్వత భవనాలు



పట్టణంలో చేపల మార్కెట్ నిర్మాణానికి రూ. 50 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.56 కోట్లు, గ్రంథాలయ భవన నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 25 లక్షలు మంజూరయ్యాయి. పట్టణంలోని అంతర్గత రహదారులపై సీసీ నిర్మాణం దాదాపు పూర్తయింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 'మన ఊరు–మనబడి'లో భాగంగా వసతులు అందుబాటులోకి వచ్చాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం అంబేద్కర్ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు.

అలసత్వం వీడితేనే మేలు

ధర్మారం పట్టణాభివృద్ధికి విరివిగా నిధులు మంజూరైనా పనులు చేయించడంలో ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలున్నాయి. గుత్తేదారులతో సకాలంలో పనులు పూర్తి చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే పనులు నాణ్యతతో సకాలంలో పూర్తవుతాయి.

మారనున్న బస్టాండు రూపురేఖలు

పరిసర మండలాలకు కూడలిగా ఉన్న ధర్మారం పట్టణంలోని బస్టాండు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. వివిధ అవసరాలకు, సామగ్రి కొనుగోలుకు వివిధ గ్రామాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. బస్టాండు అభివృద్ధికి రూ. 1.50 కోట్లు మంజూరు కావడంతో రూపురేఖలు మారనున్నాయి. ప్రధాన రహదారిని ఆనుకొని రెండు వైపులా దుకాణ సముదాయాలు నిర్మించనున్నారు. దీంతో చిరు వ్యాపారులకు మడిగెలు అందుబాటులోకి రానుండగా ఆర్టీసీకి ఆదాయం వస్తుంది. దీనికి తోడు ప్రయాణ ప్రాంగణంలో అపరిశుభ్రత తొలగనుంది.

## అక్రమ దందా.. కొరవడిన నిఘా..!

ఆలేరు : యాదాద్రి భువనగిరి జిల్లాలో పేలుడు పదార్థాల తయారీ, నిల్వలు, రవాణాపై స్థానిక పోలీసుల నిఘా కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్‌వోటీ పోలీసులు దాడుల చేస్తూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ.. కొద్ది రోజుల అనంతరం మళ్లీ యథావిధిగా కొనసాగుతున్నాయి. క్వారీలు, వెంచర్లలో బండరాళ్లను తొలగించేందుకు నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు.

కొందరికే ..జిల్లాలో పేలుడు పదార్థాలతో పాటు, అమ్మోనియం నైట్రేట్ స్టోరేజీ పాయింట్లు ఉన్నాయి. కొన్నింటికి అనుమతులు ఉండగా..మరికొన్నింటికి అనుమతులు లేనట్లు సమాచారం. గతంలో వరంగల్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పట్టుబడిన కొన్ని పేలుడు పదార్థాలు యాదాద్రి జిల్లా నుంచి సరఫరా అయ్యాయి. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్లలో కుక్క పేలుడు పదార్థాన్ని కొరకడంతో మృత్యువాత పడిన ఘటనలు అప్పట్లో సంచలనం కల్గించాయి. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో పేలుడు పదార్థాలు పట్టుబడినా..వీటిలో కొన్నింటికి యాదాద్రి భువనగిరి జిల్లా మూలాలు ఉంటుండటం గమనార్హం. జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లు, మేగ్జిన్ బాక్సులు, కనెక్టింగ్ తీగ, బ్లాస్టింగ్ వైరు లాంటివి జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలుతున్నాయి.

లెక్కలేవీ?జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న పేలుడు పదార్థాలపై పోలీసుల నిఘా కొరవడింది. డీలర్ల నుంచి క్షేత్రస్థాయికి తరలుతున్న పేలుడు పదార్థాలపై లెక్కలు సరిగా ఉండటం లేదని సమాచారం. రవాణా చేసే వాహనం, ఆయా మార్గంలో ప్రయాణించేందుకు అనుమతులు ఉండాలి. కానీ కొన్ని సమయాల్లో అనుమతులు లేకుండానే పేలుడు పదార్థాలను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దరఖాస్తు చేయాలి..పేలుడు పదార్థాల వినియోగానికి పోలీసుల నుంచి విధిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. రైతులు, భూమి యజమాని తమ పొలంలోని బండరాళ్లను తొలగించేందుకు ముందుగా పోలీసు కమిషనర్, జిల్లా ఎస్పీకి దరఖాస్తు చేయాలి. సదరు ప్రాంతం బ్లాస్టింగ్‌కు అనుకూలంగా ఉందా? అనే విషయాన్ని ఏసీపీ లేదా సీఐ ర్యాంకు స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇస్తారు. నివేదిక ఆధారంగా బ్లాస్టింగ్‌కు అనుమతి ఇస్తారు. ఇందుకు రైతులు, వ్యక్తులు కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. బ్లాస్టింగ్ చేయాలనుకునే సంస్థ, వ్యక్తులకు లైసెన్సు ఉండాలి. అనుమతి లేనివారు బ్లాస్టింగ్ చేస్తే ఎక్స్‌ప్లోజివ్స్ చట్ట ప్రకారం శిక్షార్హులు.

2023 సెప్టెంబరు 8న యాదగిరిగుట్టలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. డి.వినోద్ అనే వ్యక్తి వద్ద ఆరు జిలెటిన్‌స్టిక్స్, 5 డిటోనేటర్స్ దొరికాయి. విచారణలో శివరాత్రి మహేష్ తనకు విక్రయించాడని చెప్పడంతో.. రాయిగిరిలోని మహేష్ ఇంటిని సోదా చేయగా 239 జిలెటిన్‌స్టిక్స్, 666 డిటోనేటర్లు దొరికాయి. ఇద్దరిపైనా కేసులు నమోదు చేశారు.

2019 ఆగస్టులో శంషాబాద్ సమీపంలో బిల్లు, వేబిల్లు లేకుండా అమ్మోనియం నైట్రేట్ తరలిస్తున్న వాహనాన్ని అక్కడి పోలీసులు పట్టుకున్నారు. సోడియం నైట్రేట్ పేరుతో పేలుడుకు ఉపయోగించే అమ్మోనియం నైట్రేట్‌ను అక్రమంగా రవాణా చేశారు. విచారణలో భువనగిరి మండలంలోని ఒక ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ నుంచి అక్రమంగా తరలినట్లు తేలింది.

జిల్లాలోని బొమ్మలరామారం మండలం మైలారం, రాంలింగంపల్లి, నాగినేనిపల్లి, పెద్దపర్వతాపూర్, బీబీనగర్ మండలం జమీలాపేట, నెమరగొమ్ముల, జియాపల్లి, ఆలేరు మండలం శ్రీనివాసపురంలోని క్రషర్స్‌లో పేలుడు పదార్థాలను వినియోగిస్తూ కొండలు, గుట్టలను పేల్చివేస్తున్నారు. దీంతో సమీపంలోని ఇళ్లకు బీటలు ఏర్పడుతున్నాయి.

# శబరి మాత మహోత్సవం.. గిరిబిడ్డల ఆధ్యాత్మిక వైభవం



భద్రాచలం : రామాయణ మహా కావ్యంలో చిన్న పాత్రగా ఉన్న ఆదివాసీ బిడ్డ శబరి తనలో ఉన్న భక్తితో మానవ రూపంలో తిరుగుతున్న రాముడ్ని దర్శించుకుని పునీతురాలైంది. ఆమె శ్రీరామగిరి (ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా) ప్రాంతంలో మతంగ మహర్షి ఆశ్రమంలో నివసించింది. వనవాసం సమయంలో రాముడి రాక కోసం ఆమె 13 వసంతాలు ఎదురు చూడడం విశేషం. అందుకే ఆమెను వాల్మీకి 'ధర్మ నిపుణ' అని ప్రస్తావించారు. ఇంతటి మహనీయురాలు పేరిట భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో అశ్వయుజ పౌర్ణమికి ఉత్సవం నిర్వహించడం దశాబ్ద కాలంగా ఆనవాయితీగా మారింది. శబరి స్మృతి యాత్ర పేరిట ఈనెల 28న గిరిజన సంప్రదాయంలో సంబరం నిర్వహించనున్నారు. మన్యం నుంచి గిరిజనులను ప్రత్యేక బస్సుల్లో తీసుకొచ్చి ఉత్సవం తర్వాత వారిని ఇంటికి పంపే బాధ్యత దేవస్థానానిదే. సిబ్బందికి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఈవో రమాదేవి తెలిపారు.

శబరి నదిగా మారి..

వనవాసం సమయంలో సీతాదేవి అపహరణ తర్వాత ఆ అమ్మ జాడ కోసం రామ లక్ష్మణులు అన్వేషిస్తుంటారు. తన రాక కోసం మార్గమధ్యలో శబరి ఎదురు చూస్తున్నట్లు గంధర్వుడి ద్వారా రామయ్యకు తెలుస్తుంది. ఒక రోజు రామలక్ష్మణులు ఈ ఆశ్రమానికి చేరుకుంటారు. శబరి తన వద్ద ఉన్న తాజా పండ్లు రుచిగా ఉన్నాయో లేదో కొరికి, ఆ తర్వాత వాటిని రాముడికి ఫలహారంగా అందిస్తుంది. రాముడి ఆకలి తీర్చినందుకు కృపను పొందింది. రామ దర్శనంతో పునీతమైన ఆమె దేహం ద్రవించి జీవనదిగా మారినట్లు స్థల పురాణం చెబుతోంది. ఇలా మారిన నది శబరి నదిగా కీర్తికెక్కిందని భక్తుల నమ్మకం.

ఆ రోజు ప్రత్యేక పూజలు..

రామాలయంలో పూలు పండ్లతో పూజలు చేసే క్రమంలో అదే రోజున ఒక బృందం శబరి నదికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయ సంప్రదాయంలో ఆరాధిస్తారు. శబరి నది ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో సింకారం కొండల్లో పుట్టింది. ఈ రెండు రాష్ట్రాల గుండా ప్రవహించి ఆంధ్రప్రదేశ్‌లోని కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు మండలాల వరకు తన ప్రయాణాన్ని కొనసాగిస్తుంది. మహారాష్ట్రలోని నాసిక్ వద్ద పుట్టిన గోదావరి తెలంగాణాలోని భద్రాచలం రాముడి పాదాలను తాకుతూ ప్రవహిస్తుంది. ఈ క్రమంలో కూనవరం వద్ద గోదావరిలో శబరి సంగమిస్తుంది. మూడు రాష్ట్రాలలో మొత్తంగా 418 కి.మీ దూరం శబరి ప్రయాణిస్తుంది.

రామయ్యకు ఘనంగా తిరుమంజనం

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఘనంగా తిరుమంజనం నిర్వహించారు. భక్తులు ఉదయమే చేరుకుని భజనలతో పూజించారు. కౌసల్య సుపుత్రుడి దర్శనం పరమపావనం అంటూ ప్రణమిల్లారు. అర్చకులు రామయ్యకు సుప్రభాతం పలికి ఆరాధించారు. భక్తిప్రపత్తులతో నామార్చన నిర్వహించారు. సీతమ్మకు యోక్త్రధారణ రామయ్యకు యజ్ఞోపవీత ధారణ చేశారు. వైష్ణవ సంప్రదాయంలో కన్యాదానం నిర్వహించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక ఆనందాన్ని అందించాయి. దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. ధనలక్ష్మీ అలంకారంలో.. విజయ దశమి ఉత్సవాలు రామాలయంలో వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తున్నారు. బుధవారం ధనలక్ష్మిగా కనిపించి అలరించారు. మహిళలు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని సామూహిక కుంకుమార్చన చేశారు. చిత్రకూట మండపంలో రామాయణ పారాయణంతో పాటు హోమం నిర్వహించారు. గురువారం ధాన్యలక్ష్మిగా అమ్మవారు దర్శనమిస్తారు. ఉత్సవాలకు భక్తుల తాకిడి క్రమంగా పెరుగుతుండడంతో ఈవో రమాదేవి నేతృత్వంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు.

# ఆయుధాల అప్పగింత తప్పనిసరి

మిర్యాలగూడ : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆయా చోట్ల గట్టి బందోబస్తు కల్పించనుంది. హింసకు తావివ్వకుండా పోలీసు శాఖ, అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగా లైసెన్స్ ఆయుధాలు కలిగి ఉన్న వారి నుంచి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. ఈసారి ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం పోలీసు ఉన్నతాధికారులపై బదిలీ వేటు వేస్తూ కింది స్థాయి పోలీసు అధికారులు సైతం నియమావళి కచ్చితంగా అమలు చేసేలా సంకేతాలిస్తోంది. దీంతో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 9న ఎన్నికల షెడ్యూల్ మొదలవగానే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది.

ఆయుధాల లైసెన్సుల జారీ విధానం ఇలా..

ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉందని వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఇతరులు తమకు ఆయుధాల వినియోగానికి అవకాశం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకుంటారు. దాన్ని సంబంధిత ఠాణాకు పంపిస్తారు. అర్జీ సమర్పించిన వ్యక్తికి నిజంగా ప్రాణహాని ఉందా లేదా అని పరిశీలిస్తారు. అంతకు ముందు జరిగిన గొడవలు, కేసుల పూర్వాపరాలను తెలుసుకుంటారు. ఎలాంటి ఆయుధం వినియోగించనున్నారనేది పరిశీలించి సీఐ, డీఎస్పీ, ఎస్పీలకు నివేదిస్తారు. దాని ప్రకారం పాలనాధికారి లైసెన్స్ జారీ చేస్తారు. ఒక సారి లైసెన్స్ పొందిన వారు పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో ముందస్తుగా లైసెన్సు కలిగిన ఆయుధాలను సంబంధిత పోలీసు స్టేషన్‌లో అప్పగించి ఎన్నికల తరువాత తిరిగి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

చట్టం ఏం చెబుతోందంటే..

దేశ పౌరుడు గన్ లైసెన్స్‌ను 1959 నాటి ఆయుధ చట్టం ప్రకారం పొందాల్సి ఉంటుంది. భారతీయులకు ఎన్పీబీ తుపాకులు మాత్రమే కొనుగోలు చేయడానికి అవకాశం ఉంది. లైసెన్స్ పొందాలనుకునే వ్యక్తి ప్రాణాలకు పెద్ద ముప్పు ఉంటేనే తుపాకీ లైసెన్స్ పొందడానికి అనుమతి ఉంటుంది. ఆత్మరక్షణకు తప్ప మరే సందర్భంలోనూ వినియోగించకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఆయుధం ఉపయోగిస్తే ఆయుధ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు. లైసెన్సు రద్దు చేస్తారు.

లైసెన్స్ పొందాక

తుపాకీ లైసెన్స్ పొందిన తర్వాత వినియోగదారుడు కచ్చితంగా తుపాకీ డీలరును సంప్రదించాలి. లైసెన్స్ పునరుద్ధరణ సమయంలో తుపాకీని కచ్చితంగా చూపించాల్సిందే. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ఆయుధం అప్పగించకుండా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను బెదిరించడం చట్టరీత్యా నేరం. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలోనే ఆయుధాలను ఉంచి వెళ్లాలి. విధి నిర్వహణలో పోలీసులు, గన్‌మెన్‌లు, కేంద్ర పోలీసు బలగాలు మినహా మిగిలిన వారు ఆయుధాలను వినియోగించకూడదు.

ఉమ్మడి జిల్లాలో ఆయుధాల పరిస్థితి

యాదాద్రి భువనగిరి జిల్లాలో లైసెన్సులు కలిగిన ఆయుధాలు 20 ఉన్నాయి. వీటిని అప్పగించాలని ఇప్పటికే ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో వారికి సమాచారం అందించారు. వాటి అప్పగింత ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది.

సూర్యాపేట జిల్లాలో వంద వరకు లైసెన్సులు కలిగిన ఆయుధాలున్నాయి. వీటిని అప్పగించేలా ఆయా పోలీసు స్టేషన్ల అధికారులు సమాచారం అందించి తిరిగి తీసుకుంటున్నారు.

నల్గొండ జిల్లాలో 237 ఉండగా ఇప్పటి వరకు 77 ఆయుధాలు సంబంధిత లైసెన్సుదారులు పోలీసులకు అప్పగించారు. మిగతావి అప్పగింత ప్రక్రియ జరుగుతోంది.

మినహాయింపు కోరితే..

ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. లైసెన్స్ ఆయుధాల కలిగి ఉన్నవారు సంబంధిత ఠాణాల్లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం తిరిగి వారికి ఇవ్వనున్నారు. ఒక వేళ డిపాజిట్ విషయంలో మినహాయింపు కోరే వారు కలెక్టరేట్‌లోని జిల్లా ఆయుధ స్క్రీనింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకుల వద్ద సెక్యూరిటీ వారు కాకుండా వ్యక్తిగతంగా వినియోగించే వారు డిపాజిట్ చేయాలి. ఉమ్మడి జిల్లాలో లైసెన్సు ఆయుధాల అప్పగింత ప్రక్రియ సాగుతోంది.

లైసెన్సు ఆయుధాలు అప్పగించాల్సిందే..

- వెంకటగిరి, డీఎస్పీ, మిర్యాలగూడ

లైసెన్స్ ఆయుధాలు కలిగి ఉన్నవారు తప్పనిసరిగా సంబంధిత ఠాణాల్లో డిపాజిట్ చేయాలి. ఇప్పటికే ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని ఆయుధాలు కలిగిన వారి సమాచారం ఆయా ఎస్‌హెచ్‌వోలకు అందించాం. అన్నింటిని డిపాజిట్ చేసేలా వారు చూస్తారు. బ్యాంకు సెక్యూరిటీ గార్డులు, జాతీయ రైఫింగ్ అసోసియేషన్‌లో సభ్యులు, నెలన్నర రోజుల క్రితం రైఫింగ్ షూటింగ్‌లో పాల్గొన్న వారికి మినహాయింపు ఉంటుంది. ఇతరులు ఎవరైనా మినహాయింపు కోరితే అందుకు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం. ఓట్ల లెక్కింపు పూర్తయిన వారం రోజుల్లో తిరిగి అందజేస్తాం.

# ఉద్యోగులపై ఎన్నికల కమిషన్ నిఘా

నల్గొండ : జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆయా పార్టీలకు అనుకూలంగా కొందరు ప్రత్యక్షంగా, మరి కొంతమంది సోషల్ మీడియా ద్వారా పోస్టులు పెడుతూ ఉడుతాభక్తి చాటుకుంటున్నారు. కానీ.. ఉద్యోగులకు ఆ అవకాశం లేదు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పరిధిలోని కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనడం నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుంది. ప్రచార సభల్లో పాల్గొనడం, ప్రచారం చేయడం, నేతలకు వ్యతిరేకంగా మాట్లాడటం, పోస్టులు పెట్టడం అంటే ఉద్యోగానికి ఎసరొచ్చినట్టే. జిల్లాలో ఈ మేరకు ఉన్నతాధికారులకు కొన్ని ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో ఉద్యోగులపై నిఘా ఉంచాలని, వీడియో సర్వైలెన్స్ కమిటీలకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. నిబంధనలు ఇవీ..ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు ప్రచారం చేయరాదనే నిబంధనలు 1949 సెప్టెంబరు 17వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయి. సెక్షన్ 23(ఐ)ప్రకారం వారంతా ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ కార్పొరేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు. ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనకూడదు. తన కింది స్థాయి ఉద్యోగులను ఇతరులను పలాన పార్టీలకు ఓటు వేయాలని ఒత్తిడి చేయకూడదు. ఓటర్లను ప్రలోభాలకు గురయ్యేలా ప్రకటనలు ఇవ్వకూడదు. రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం నిర్వహించకూడదు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టొద్దు.రాజకీయ పార్టీల అభ్యర్థులు, పార్టీ శ్రేణులు నిర్వహిస్తున్న సభలు, సమావేశాలను ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా వీడియో, సర్వైలెన్స్, స్టాటికల్ అధికారులు నిఘా పెట్టి వీడియో చిత్రీకరణ పనులను చేశారు.

# పండగ వేళ.. దొంగల బెడద!



భూపాలపల్లి : దసరా సమీపిస్తోంది.. ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు మొదలయ్యాయి. చాలా మంది ఇళ్లకు తాళం వేసి కుటుంబంతో సహా సొంతూరు, బంధువుల ఇళ్లకు బయల్దేరి వెళ్తున్నారు. ఈ సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పండగ సంబరంగా జరుపుకోవచ్చని పోలీసులు సూచిస్తున్నారు. లేదంటే చేదు అనుభవాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇంటికి తాళం వేసి ఊరెళ్లే వారు ఎవరైనా తప్పనిసరిగా వివరాలు సమీప పోలీసుస్టేషన్‌లో తెలపాలని కోరుతున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు.. పగలూ, రాత్రి తేడా లేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. గంటల వ్యవధిలోనే దోచేస్తున్నారంటే రోజుల తరబడి తాళం వేసి వెళ్తే భద్రత ఏమాత్రం ఉంటుందో ఊహించుకోవచ్చు. గడిచిన రెండేళ్లలో దసరా, దీపావళి సెలవుల సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లిన వారి ఇళ్లల్లోనే ఎక్కువ దొంగతనాలు చోటుచేసుకున్నాయి. ఈ సారైనా.. తస్మాత్ జాగ్రత్త..!

నిఘా పెంచడంలో నిర్లక్ష్యం

జిల్లాకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలున్నాయి. దీంతో అంతర్ రాష్ట్రాలతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చే దొంగల ముఠా బెడద ఎక్కువగా ఉంటోంది. గతంలో వేసవిలో ఎక్కువ ఘటనలు చోటుచేసుకునేవి. ఇటీవల సీజన్‌తో నిమిత్తం లేకుండా పట్ట పగలే సొత్తు మాయం చేస్తున్నారు. దోపిడీలు సంభవిస్తున్నాయి. వాహన చోరీలూ ఇటీవల ఎక్కువయ్యాయి. ఇందుకు తగినట్లు పెట్రోలింగ్, బీట్ డ్యూటీలు పెంచడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రతి స్టేషన్ పరిధిలోని రెడ్ జోన్, అనుమానిత ప్రాంతాల్లో బ్లూ కోల్ట్స్ సిబ్బంది ఉదయం, సాయంత్రం పెట్రోలింగ్ చేయాల్సి ఉంది. కానీ, అలా చేయలేకపోతున్నారు. పోలీసులు అర్ధరాత్రి వేళల్లో అక్కడక్కడా తిరిగి వెళ్లడం వరకే పరిమితమవుతున్నారు. కేవలం ప్రధాన రహదారులపైనే దృష్టి సారిస్తున్నారు. ఇదే దొంగలకు అవకాశంగా మారుతోంది. బీట్ బృందాల గస్తీలు తగ్గడంతో సంచారం ఉండని ప్రాంతాల్లో సులువుగా ఇళ్లు ఖాళీ చేస్తున్నారు. అందుకే సీజన్‌తో సంబంధం లేకుండా చోరీ ఘటనలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా గస్తీ వ్యవస్థను పటిష్ఠం చేయాలని, గ్రామాల్లో నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ జాగ్రత్తలు మేలు

తాళం వేసి ఉన్న ఇంటికి రక్షణగా రక్త సంబంధీకులు, నమ్మకస్థుల్లో ఒకరిని ఉంచాలి.

ఊరెళ్లాల్సి వస్తే విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులను బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. లేదా తమ వెంట తీసుకెళ్లాలి.

ఊరికి వెళ్లే ముందు దగ్గర్లోని పోలీసు స్టేషన్లలో సమాచారం ఇవ్వాలి.

కాలనీల్లో అనుమానాస్పద, గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలి.

ఇంటికి సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్, సెంట్రల్ లాక్ సిస్టం అమర్చుకోవాలి.

ఇంటి ఆవరణలోని సీసీ కెమెరాలను ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తుండాలి.

లి అపార్టుమెంట్ల దగ్గర నమ్మకమైన వాచ్‌మెన్‌లను నియమించుకోవాలి.

ఇంటి ముందు చెత్త, దినపత్రిక, పాలప్యాకెట్లు జమ కానివ్వొద్దు.

ప్రధాన ద్వారానికి తాళం వేసినా కనిపించకుండా పరదాలు వేయాలి.

ఊరెళ్తున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోకూడదు.

కాలనీల్లో స్వచ్ఛంద కమిటీలు ఏర్పాటు చేసుకొని, పోలీసులకు అందుబాటులో ఉండాలి.

గస్తీ పెంచుతాం

రాంనర్సింహారెడ్డి, సీఐ, భూపాలపల్లి

దొంగతనాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. సిబ్బందిని బృందాలుగా నియమించి గస్తీ పెంచాం.. తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు లక్ష్యంగా పెట్టుకుంటారు. ఊరెళ్లాల్సిన వారు చుట్టుపక్కల వారితో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అప్రమత్తంగా వ్యవహరించడం చాలా అవసరం.. అన్ని కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

# జెండాలు, కండువాల తయారీ ఇక్కడే..!

చౌటుప్పల్ : కేసీఆర్ బొమ్మతో రెపరెపలాడే గులాబీ జెండా, అభయహస్తం గుర్తుతో మువ్వన్నెల పతాకం, రా! కదలిరా! అంటూ ఎన్టీఆర్ బొమ్మతో పసుపుజెండా, కాషాయం రంగులో వికసిస్తున్న కమలం ధజం, నీలిరంగు జెండాపై ఏనుగు... ఎన్నికల సమరంలో ఆకర్షణ వీటిదే. మెడలో పార్టీ కండువా, చేతిలో జెండా పట్టుకున్న కార్యకర్తలే ప్రచారకర్తలు. పోటీ చేసే నేతలకు బలాన్ని, గుర్తింపునిచ్చే జెండాలు, కండువాలు లక్షల సంఖ్యలో చౌటుప్పల్‌లోని మారుతీ కాటెక్స్ అనే మిల్లులో తయారై తెలంగాణ అంతటికీ సరఫరా అవుతున్నాయి. ఎన్నికల సమయంలో వీటి తయారీతో స్థానికంగా రెండొందల మంది కార్మికులకు ఉపాధి లభిస్తుంది.

ఊళ్లలో రెపరెపలాడే ఈ జెండాల తయారీ ప్రక్రియ ఆసక్తికరంగా ఉంటుంది. సిరిసిల్ల, సూరత్‌లోని మరమగ్గాలపై తయారయ్యే ముడి వస్త్రాన్ని ఈ మిల్లుకు తీసుకొస్తున్నారు. దాన్ని 'యూజడ్' యంత్రంలో ఆవిరితో ఉడికించి మల్లెపువ్వులా తెల్లగా బ్లీచింగ్ చేస్తారు. హైటెక్ స్టంటర్ మిషన్‌లో 180 నుంచి 200 డిగ్రీల ఉష్ణోగ్రతలో ప్రాసెసింగ్ చేస్తారు. డిజైనర్లు రాజకీయ పార్టీలవారు కోరిన రంగుల్లో, వివిధ ఆకారాల్లో, నేతల ఫొటోలతో జెండాలు, కండువాలు కంప్యూటర్లపై డిజైన్లు రూపొందించి ముద్రణకు సిద్ధం చేస్తారు. ప్రాసెసింగ్ పూర్తయిన వస్త్రంపై ఈ డిజైన్లతో ఫ్లాట్‌బెడ్ మిషన్లపై రోజుకు 5 వేల మీటర్ల చొప్పున 50 వేల మీటర్ల వస్త్రంపై జెండాలు, కండువాల ప్రింటింగు చేస్తున్నారు. ముద్రించిన వస్త్రాన్ని లూపేజర్ యంత్రంలో 170 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఫిక్సింగ్, వాషింగ్ ప్రాసెస్ చేస్తారు. చివరగా సైంటర్ మిషన్‌లో తుది మెరుగులు దిద్ది, కావలసిన విధంగా యంత్రంపైనే మడతలు పెట్టి రాష్ట్రం నలుమూలలకూ ఏజెంట్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.

# అందరి దృష్టి.. ఆ నాలుగింటి పైనే..!

నల్గొండ : కాంగ్రెస్ పార్టీలో చేరికలతో ఉమ్మడి జిల్లాలో క్షేత్రస్థాయిలోని కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొనగా.. టిక్కెట్ కేటాయింపుపై ఉత్కంఠ ఉన్న మిర్యాలగూడ, మునుగోడు, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలపై అందరి దృష్టి పడింది. కమ్యూనిస్టులతో పొత్తులు తుది దశకు చేరుకున్నాయని పార్టీ సీనియర్ నేతలు వెల్లడిస్తున్న నేపథ్యంలో.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిర్యాలగూడ, మునుగోడు స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. పొత్తుల్లో భాగంగా పాలేరు, మిర్యాలగూడ, భద్రాచలం, హుస్నాబాద్ స్థానాలను సీపీఎం కోరగా, కొత్తగూడెం, మునుగోడు, బెల్లంపల్లి స్థానాలను సీపీఐ కోరినట్లు తెలిసింది. కాంగ్రెస్ మాత్రం ఉమ్మడి జిల్లాలో కేవలం మిర్యాలగూడ స్థానాన్ని సీపీఎంకు కేటాయించేందుకు ప్రాథమిక చర్చలు పూర్తయినట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం. దీంతో ఇక్కడ ఆ పార్టీకి కేటాయిస్తే ఎన్నికల్లో సహకరించేది లేదంటూ నియోజకవర్గ క్యాడర్ ఇప్పటికే స్పష్టం చేస్తోంది. ఇక్కడి నుంచి డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో పాటూ పురపాలిక పార్టీ ఫ్లోర్‌లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి టిక్కెట్‌కు దరఖాస్తు చేశారు. తాజాగా ఈ స్థానం సీపీఎంకు కేటాయిస్తారనే విస్తృత ప్రచారం నేపథ్యంలో పార్టీ శ్రేణులు, నాయకులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కమ్యూనిస్టులకు టిక్కెట్ కేటాయింపు అంశంలో బుజ్జగింపుల కమిటీ ఛైర్మన్ జానారెడ్డి కీలక పాత్ర పోషించనున్న నేపథ్యంలో అవసరమైతే ఒకట్రెండు రోజుల్లో ఆయన్నే కలవాలని పార్టీ శ్రేణులు నిర్ణయించినట్లు సమాచారం.

మునుగోడుపై పట్టువీడని సీపీఐ

గతంలో పలుమార్లు ప్రాతినిధ్యం వహించిన మునుగోడు నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలని సీపీఐ పట్టుబడుతోంది. మునుగోడు కాకుండా కొత్తగూడెంతో పాటూ చెన్నూరు స్థానాలను ఇవ్వడానికి కాంగ్రెస్ మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. దీంతో మునుగోడు క్యాడర్ అవసరమైతే ఒంటరిగా బరిలోకి దిగాలని ఆలోచించగా..పార్టీ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి మంగళవారం చౌటుప్పల్‌లో పార్టీ నాయకులతో సమావేశమై దీర్ఘకాలిక లక్ష్యాలకు తోడూ భారాస, భాజపా ఓటమికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. మరోవైపు ఈ స్థానాన్ని సీపీఐకి కేటాయిస్తే ఓట్ల బదలాయింపు జరగక భారాస, భాజపాలకే లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ వర్గాలు పార్టీ అధిష్ఠానానికి నచ్చజెబుతున్నాయి. ఇక్కడి నుంచి పార్టీ టిక్కెట్ కోసం గత ఉప ఎన్నికల్లో పోటీ చేసిన పాల్వాయి స్రవంతితో పాటూ చల్లమల్ల కృష్ణారెడ్డి, ఓయూ విద్యార్థి ఉద్యమ నేత పున్నా కైలాశ్ దరఖాస్తు చేశారు. ఒకవేళ సీపీఐకి ఇవ్వని పక్షంలో ఈ స్థానంలో ఈ ముగ్గురిలో ఒకరికి టిక్కెట్ వచ్చే అవకాశం ఉంది.

ఆ రెండింట్లో టిక్కెట్ దక్కేదెవరికో..?

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్ కోసం తీవ్ర పోటీ ఉన్న నియోజకవర్గాలు సూర్యాపేట, తుంగతుర్తి. తుంగతుర్తిలో ఏకంగా టిక్కెట్ కోసం 23 మంది దరఖాస్తు చేయగా... సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పార్టీ నేత పటేల్ రమేశ్‌రెడ్డి పోటీ పడుతున్నారు. సూర్యాపేట టిక్కెట్ కోసం స్క్రీనింగ్ కమిటీలోని సభ్యులు రెండుగా చీలడం గమనార్హం. దీంతో ఈ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థిని చివరి విడతలోనే ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తుంగతుర్తిలోనూ అభ్యర్థి ఎంపిక కాంగ్రెస్‌కు కత్తిమీదసాములా మారింది. గత రెండు ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిన అద్దంకి దయాకర్ మరోసారి పోటీకి తీవ్ర ప్రయత్నం చేస్తుండగా.. ఓయూ విద్యార్థి నాయకులు పిడమర్తి రవి, ప్రీతమ్ తదితరులు టిక్కెట్ కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

# సన్నాయి మోగింది..!

ఎన్నడూ లేని ధర సన్నరకం ధాన్యానికి వచ్చింది. క్వింటాకు రూ. 2,650 పలికింది. ప్రస్తుతం సన్నరకానికి డిమాండ్ ఉండటంతో పాటు పంట తక్కువగా సాగవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ఆరంభంలోనే ఇంత ధర ఉంటే చివరికి రూ. 3,200 వరకు ఉంటుందని అంచనా.

తక్కువ సాగు.. ఎక్కువ డిమాండ్

సాగర్ ఆయకట్టుతో పాటు ఉమ్మడి జిల్లాలోని సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి సాగవగా.. అందులో ఆరు లక్షల ఎకరాల్లో సన్నరకాలు సాగైనట్లు అంచనా వేస్తున్నారు. మిగతావి దొడ్డు రకాలు. ఇప్పటికే దొడ్డు రకాల కొనుగోలుకు ఐకేపీ కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సన్న రకాలను మిల్లర్లు కొనుగోలు చేయనున్నారు. గతంలో కంటే ఈసారి మిల్లుల సామర్థ్యం పెరగడంతో మిల్లర్లకు ఎక్కువ ధాన్యం అవసరం ఉంది. అందుకు తగినట్లు పంట సాగు లేకపోవడంతో సన్న రకాల ధాన్యానికి డిమాండ్ పెరగనుంది. సాగర్ ఆయకట్టులో 3.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా.. అందులో 30 శాతం ఈ వానాకాలంలో పంట వేయలేదు. సాగు ఎక్కువగా లేకపోవడంతో ధాన్యానికి గిరాకీ పెరగనుంది. గత వానాకాలం, యాసంగిలోనే మిల్లులకు సరిపడా ధాన్యం రాకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో పండించిన సన్న ధాన్యం మూడు నెలల కంటే ఎక్కువ మిల్లింగ్ చేయడానికి సరిపోదు. యాసంగి పంట చేతికి వచ్చే వరకు అంటే మార్చి చివరి నాటికి సరిపోయే ధాన్యం కొనుగోలు చేయాల్సిందే. అందుకే మిల్లర్లు రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎక్కువ ధర పెట్టి కొనడానికి వెనకాడటం లేదు.

భారీగా డిమాండ్

దొడ్డు రకాలను ఐకేపీల ద్వారా ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,200లకు కొనుగోలు చేయనున్నారు. సన్న రకాలను కేవలం మిల్లర్లు కొంటారు. గత వానాకాలం ఆరంభంలో రూ. 2,400 పలికిన ధర కొద్దిరోజుల తర్వాత ఒకేసారి పంట చేతికి వచ్చి ధాన్యం రావడంతో మిల్లర్లు ధర తగ్గించి క్వింటాకు రూ. 2,200-2,100 వరకు కొనుగోలు చేశారు. యాసంగి ఆరంభంలో రూ. 2,250 నుంచి రూ. 2,450 వరకు వెళ్లి చివరకు రూ. 2,550 వరకు కొనుగోలు చేశారు. ధర తగ్గించిన సమయంలో రైతులు ఓపికగా ఆరబెట్టుకొని దాచుకున్నారు. దీంతో మిల్లులకు ధాన్యం రాకపోవడంతో ధర పెంచేశారు. అదే దాచుకున్న ధాన్యం రూ. 3,750 వరకు కొనుగోలు చేశారు. కొత్త ధాన్యం వచ్చే లోగా అమ్ముకుంటే ఈ ధర వస్తుందని, కొత్తవి వస్తే పాతవి అంత ధర పెట్టి కొనుగోలు చేయరని మిల్లర్లు పేర్కొంటున్నారు. ఈసారి ధర ఎక్కువగా ఉండే అవకాశం ఉందని మిర్యాలగూడలోనే గత యాసంగిలో కొత్త మిల్లులు వర్క్ ప్రారంభించాయని, పాలకవీడు మండలంలో నాలుగు మిల్లులు నిర్మాణానికి సిద్ధమవుతున్నాయని తెలిసింది. పాలకవీడు మండలంలోని మిల్లులతో పాటు మిర్యాలగూడలోని కొత్త మిల్లులు, సామర్థ్యం పెంచుకున్న మిల్లులకు అదనంగా ధాన్యం అవసరం. అందుకే ఈసారి ధాన్యానికి డిమాండ్ భారీగా ఉండటంతో పాటు ధర ఆశించిన దానికంటే ఎక్కువ రావచ్చని అంచనా. ప్రస్తుతం రూ. 2,600 కంటే తగ్గదని మిల్లర్లే అంచనా వేస్తున్నారు.

తగ్గనున్న దిగుబడి..

ఈసారి దిగుబడులు బాగా తగ్గే అవకాశం ఉంది. ఎండల తీవ్రతకు ఏపుగా పెరగకపోవడంతో పాటు ఆశించిన స్థాయిలో పంట ఆరోగ్యంగా లేదని రైతులు పేర్కొంటున్నారు. గతంలో సన్నరకాలైన పచ్చి వడ్లు ఎకరానికి 40-45 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. ఇప్పుడు 25-30 బస్తాల దిగుబడి రావడమే కష్టమని రైతులు అభిప్రాయపడుతున్నారు. పంట కాలం సైతం ఎక్కువగా ఉంటుందని వెదజల్లిన, డ్రమ్‌సీడర్‌తో వేసిన పంట ఆలస్యంగా వస్తుందని, నాట్లు వేసిన వరి త్వరగా చేతికి వస్తుందని చెబుతున్నారు. గతంలో మాదిరి దుబ్బులకు ఎక్కువ కంకులు లేవని, పుష్కలంగా నీరు ఉన్న పొలాల్లో 45 బస్తాల దిగుబడి వస్తుందని, నీరు సరిగా అందక, ఎండల తీవ్రతకు ఎండిపోయి మళ్లీ కోలుకున్న పొలాల్లో 25 బస్తాల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఈసారి పంట సైతం ఒకేసారి కోతకు వచ్చే సూచనలు లేవు. వానాకాలం వర్షాలకు అనుగుణంగా సాగు పెంచుకుంటూ సెప్టెంబరు 15 వరకు నాట్లు వేశారు. అవి డిసెంబరు చివరికి కోతకు రానున్నాయి.

# నాసిన్ చెరువు శుద్ధీకరణ

రంగారెడ్డి : : చెరువుల శుద్ధీకరణకు పూనుకుంది దమ్మాయి గూడ మున్సిపల్ పాలకవర్గం. మురుగునీటితో నిండిన చెరువులను స్వచ్ఛంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోంది. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో నాసిన్ చెరువు, కోపులకుంట, కుమ్మరికుంట జలాశయాలున్నాయి. దాదాపు 30ఏళ్ల క్రితం వరకు ఆ చెరువుల చుట్టూ ఆయకట్టును ఆ నీటితోనే సాగు చేశారు. పశువుల దప్పిక తీర్చేందుకు ఆ నీటినే వినియోగించేవారు. ఆ చెరువుల్లో పెంచిన చేపలను విక్రయించి మత్స్యకారులు జీవనోపాధి పొందారు. కాగా కాల క్రమేణ దమ్మాయిగూడ నగరానికి చేరువలో ఉండటంతో పెద్దఎత్తున జనాలు ఇక్కడికి వలస వచ్చారు. ఈ తరుణంలో చెరువు పరివాహక ప్రాంతంలో అదే స్థాయిలో కాలనీలు వెలిశాయి. ఈ క్రమంలో ఇళ్ల నుంచి వెలువడిన వ్యర్థజాలాలు చెరువులోకి చేరడంతో మురుగుకూపంగా మారింది. ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి తోడు పక్కనే జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దోమల స్వైరవిహారంతో జనాలు తరచూ అంటు వ్యాధులబారిన పడుతున్నారు. ఈ క్రమంలో చెరువును శుద్ధిచేసేందుకు మున్సిపల్ పాలక వర్గం




చర్యలు చేపట్టింది. స్థానికులు మంత్రి మల్లారెడ్డికి మొర పెట్టుకోగా ఆయన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పాలకవర్గ దీక్ష, మంత్రి కృషితో ప్రయత్నం ఫలించింది. మురుగునీరు చెరువులో చేరకుండా ప్రత్యేకంగా భారీ పైపులైన్ వేసేందుకు హెచ్ఎండీఏ ముందుకువచ్చింది. అందుకుగాను రూ.రూ. 7.10కోట్లను మంజూరు చేసింది. ఫిబ్రవరి24న మంత్రి చేతుల మీదుగా పనులు ప్రారంభిం చారు. ముందుగా ఎగువ నున్న దమ్మాయిగూడ చెరువు నుంచి పలు కాలనీల గుండా నాసిన్ చెరువు వరకు వేయాలనుకున్న పైప్‌లైన్ ప్రజల వినతి మేరకు నాగారం మున్సిపాలిటీకి అనుకుని ఉన్న కుమ్మరికుంట వరకు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. చెరువుల్లో మురుగునీరు చేరకుండా చర్యలతో పాటు మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చి దిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో మంత్రి మల్లారెడ్డి స్వయంగా పైప్‌లైన్ పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చెరువు పరిసరాలను సుందరీకరించటంతో ఆహ్లాదవాతావరణం నెలకొంటుందని, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.రూ. 7.10 కోట్లతో పనులు:-వసుపతి ప్రణీత, దమ్మాయి గూడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గతంలో శుద్ధ జలాలతో కళకళలాడిన చెరువు నేడు మురికి కూపంగా మారింది. తద్వారా స్థానికులు అనారోగ్యానికి గురౌతున్నారు. ఈ నేపథ్యంలో చెరువును శుద్ధి చేసి, మంచినీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హెచ్ఎండీఏ మంజూరు చేసిన రూ. 7.10కోట్లతో ప్రత్యేక భారీ పైప్‌లైన్ నిర్మాణాన్ని చేపట్టాం. పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.జూన్ మొదటి వారం నాటికి పనులు పూర్తి : - వెంకటేష్, ఏఈఈ, హెచ్ఎండీఏ దమ్మాయిగూడలోని నాసిన్ చెరువులో మురుగునీరు మళ్లింపు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం నాటికి (జూన్ మొదటి వారం) పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ సంవత్సరం చెరువులో కేవలం వర్షం నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం.

# అసైన్డ్ భూములపై రియల్టర్ల కన్ను

రంగారెడ్డి : మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ఉన్న అసైన్డ్‌భూములపై రియల్టర్ల కన్ను పడింది. గుట్టుచప్పుడు కాకుండా భూములు కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎకరానికి రూ. 17లక్షలకు కొంటామని రైతులకు ఆశ చూపుతూ అడ్వాన్స్‌లు కూడా ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలు క్రయవిక్రయాలకు అవకాశం లేని అసైన్డ్ భూములను ఎందుకు కొంటున్నారో ఎవరికీ తెలియడం లేదు. అసైన్డ్ భూములను కొని రిజిస్ట్రేషన్ ఎలా చేసుకుంటారని రైతులు అడిగితే.. అదంతా మేము చూసుకుంటామని రియల్టర్లు సమాధానమిస్తున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. ఈ విషయం బయటకు రాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.మొండిగౌరెల్లిలో సర్వే నెంబర్19లో 575ఎకరాల 30 గుంటలు, సర్వే నెంబర్ 68లో 788ఎకరాల 20 గుంటలు, సర్వేనెంబర్ 127లో 122ఎకరాల 22గుంటల అసైన్డ్ భూములున్నాయి. వీటిని కొనుగోలు చేయాలని నగరానికి చెందిన రియల్టర్లు చూస్తున్నారు. రైతులు ఈ భూములను రియల్టర్లకు విక్రయించడం కోసం గ్రామానికి చెం దిన కొందరు వ్యక్తులు ముందుండి వ్యవహారం నడిపిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూములు క్రయవిక్రయాలకు తావులేదని ఎవరైనా రైతులు నిలదీస్తే.. వారికి అదనంగా మరో రూ. 10వేలు ఇస్తున్నారు. కేవలం మీరు రెవెన్యూ కార్యాలయానికి వచ్చి సంతకాలు పెడితే చాలు.. అంతా తామే చూసుకుంటామని రియల్టర్లు నమ్మిస్తున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతులను నయానభయాన ఒప్పించి భూములను విక్రయించేలా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొంతమంది రైతులకు టోకన్ డబ్బు కూడా ముట్టినట్లు గ్రామంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ భూముల క్రయవిక్రయాలపై ఇటీవల జరిగిన గ్రామసభలో కూడా చర్చ జరిగింది. భూములు క్రయవిక్రయాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సర్పంచ్ బి.కృష్ణ వద్ద ప్రస్తావించగా..గ్రామసభలో చర్చకు వచ్చిందన్నారు. ఈ భూములు క్రయవిక్రయాలు జరగరాదన్నారు. ఒకవేళ అలా చేస్తే ప్రభుత్వం పీవోటీ కింద తీసుకుంటుందన్నారు.

అసైన్డ్ భూములు అమ్మితే చర్యలు మొండిగౌరెల్లి గ్రామంలో అసైన్డ్ భూములు క్రయవిక్రయాలు జరిపితే తగు చర్యలు తీసుకుంటాం. ఈ భూములపై ప్రభుత్వానికి అన్ని హక్కులున్నాయి. అసైన్డ్‌భూములకు రిజిస్ట్రేషన్ చేసే అధికారం మాకు లేదు. ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు ఎప్పుడైనా తీసుకునే అధికారముంటుంది. అందుకే క్రయ విక్రయాలు జరపరాదు. - మహమూద్ అలీ, యాచారం తహసీల్దారు

# గోడు వినండి.. గొంతు తడపండి



ములుగు : ఇంటింటికీ స్వచ్ఛమైన తాగు నీరందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ప్రజలకు వరం లాంటిదే. కానీ అసంపూర్తి పనులు, పైపుల లీకేజీలు, అప్రకటిత విద్యుత్తు కోతలు, సకాలంలో సరఫరా జరగక ప్రజలు తాగునీటికై ఇబ్బంది పడుతున్నారు. లీకేజీల కారణంగా కలుషిత తాగు నీటితో అనారోగ్యాలకు గురవుతున్నారు. వేసవి నేపథ్యంలో తాగు నీటి సమస్యపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు జాప్యం చేస్తున్నారు. పైపులైన్ల లీకేజీ, చేతిపంపుల మరమ్మతు లాంటి పనులను సైతం పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొం టోంది. 52 గ్రామాలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా యని జిల్లా అధికారులు గుర్తించారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్యపై పరిశీలనాత్మక కథనం...

ములుగులో వీవర్స్ కాలనీ వెళ్లే క్రాసు రోడ్డు వద్ద చేతిపంపు సుమారు నెల రోజుల క్రితం పాడవ్వడంతో నిరుపయోగంగా మారింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వచ్చే నీరు రెండ్రోజులకోసారి వస్తోంది. గతంలో నీటి సమస్య వచ్చిన ప్రతిసారి చేతి పంపు ఉపయోగపడేది. ప్రస్తుతం అది మరమ్మతుకి గురవ్వడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. చేతిపంపును మరమ్మతు చేయించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన స్పందన లేదని వారు చెబుతున్నారు. త్వరితగతిన తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

ఏటూరునాగారంలో తాగునీటికి కటకట

ఏటూరునాగారం మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. జలసంపద పుష్కలంగా ఉన్నా మండలంలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి ఇక్కట్లు తప్పట్లేదు. మిషన్ భగీరథ నీళ్ల సరఫరా క్రమబద్ధంగా లేకపోవడంతో ప్రజల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం, తాళ్లగడ్డ, క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో భగీరథ నీళ్లు పది రోజులు వస్తే మరో పది రోజులు రావట్లేదు. గతంలో భగీరథ నీళ్లు వస్తున్నాయనే ఉద్దేశంతో ఉన్న చేతి పంపులను వాడటం మానేశారు. దీంతో అవి పనిచేయకుండా పోయాయి. ప్రస్తుతం భగీరథ నీరు రాక, చేతిపంపులు పనిచేయక ప్రజలు తాగునీటికై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై మిషన్ భగీరథ ఏఈ మోహన్‌తో మాట్లాడగా సమస్య తమ దృష్టికి రాలేదని, వెంటనే మా సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.

బోరుబావులను ఆశ్రయిస్తున్న గ్రామస్థులు

మండలంలోని పొట్లాపూర్ గ్రామంలో వేసవి కాలంలో బోరుబావులు ఎండిపోతున్నాయి.మిషన్ భగీరథ నీరు పూర్తిగా రావడంలేదు. కొన్ని వీధులకు పైపులైన్లు వెయ్యలేదు.చేతిపంపులు సైతం పనిచేయకపోవడంతో గామస్థులు తాగునీటికై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గ్రామ సర్పంచి లత, పాలడుగుల రాకేష్, లౌడియ విజేందర్ తమ బోరుబావుల నుంచి గ్రామానికి తాగునీటిని అందిస్తున్నారు.

పది రోజులుగా నీళ్లు రావడం లేదు....

-తమ్మళ్ల మమత, క్రాస్‌రోడ్డు

పది రోజులుగా తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. వేరే ప్రాంతాలకు వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఫిర్యాదు చేద్దామంటే సంబంధిత అధికారులు అందుబాటులో ఉండట్లేదు. తాగునీటి సమస్యను గుర్తించి అధికారులు వెంటనే పరిష్కరించాలి.

సమస్యాత్మక గ్రామాల్లో చర్యలు తీసుకుంటున్నాం- సుభాష్ ఈఈ మిషన్ భగీరథ

జిల్లా వ్యాప్తంగా 52 గ్రామాలను తాగునీటి సమస్య ఉన్నవాటిగా గుర్తించాం.వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఈ గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ. 2.89 కోట్లతో ప్రతిపాదనలు చేసి 28 గ్రామాల్లో సమస్య లేకుండా చేశాం. మిగిలిన గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. పైపులైన్‌ల లీకేజీలను కూడా అరికడుతున్నాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా జిల్లాలో 21 బోర్లు, పైపులైన్లు వేసేందుకు నిర్ణయించాం.అందులో 10 బోర్లు పూర్తయ్యాయి. త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

# తాగునీటి సరఫరా అంతంతే..!



ములుగు : 'అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లుగా తయారైంది నగరంలో తాగునీటి సరఫరా తీరు. ధర్మసాగర్ చెరువులో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. సరిపడా తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలు, ప్రధాన, అంతర్గత పైపులైన్లు, సర్వీస్ రిజర్వాయర్లు(వాటర్ ట్యాంకులు) ఉన్నప్పటికీ నీరెందుకు ఇవ్వడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం నగరంలో నిత్యం తాగునీటి సరఫరాకు గ్రేటర్ వరంగల్, పబ్లిక్‌హెల్త్ ఇంజినీర్లు మల్లగుల్లాలు పడుతున్నారు. సరఫరా సాధ్యాసాధ్యాలను హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు విశ్రాంత సీఈ రవికుమార్ సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. నగరంలోని 66 డివిజన్లలో 90 శాతం కాలనీలకు రోజూ నల్లా నీళు వస్తున్నాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మరోలా ఉంది. 40-50 శాతం కాలనీలకు రోజూ, మిగిలిన 50 శాతం కాలనీలకు దినం విడిచి దినం సరఫరా జరుగుతుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలున్నాయని తెలిసింది. నగరంలో 66 డివిజన్లలో తాగునీటి సరఫరాను నాలుగు జోన్లుగా విభజించారు.

హనుమకొండ ప్రాంతంలో..హనుమకొండ వడ్డేపల్లి జోన్ పరిధిలో 70-75 శాతం నిత్యం నీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాజీపేట విష్ణుపురి, ఎఫ్‌సీఐ రిజర్వాయర్ల పరిధిలో దినం విడిచి దినం సరఫరా అవుతుందంటున్నారు. పరిశీలిస్తే కాజీపేట దర్గా, ప్రశాంత్‌నగర్, సోమిడి, డీజిల్ కాలనీ, బాపూజీనగర్, హనుమకొండ వడ్డేపల్లి, ఎన్జీవోస్ కాలనీ, జులైవాడ, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంది. హనుమకొండ కేయూసీ జోన్ పరిధిలో 24 ట్యాంకులున్నాయి. విద్యారణ్యపురి, ముచ్చర్ల రిజర్వాయర్లు తప్ప మిగిలిన వాటిలో రోజూ నీటి సరఫరా ఉందంటున్నారు. విలీన గ్రామాలు, నయీంనగర్, కొత్తూరుజెండా, రెడ్డికాలనీ, పోచమ్మకుంట, ఈద్గా తదితర ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది.

వరంగల్‌లో.. వరంగల్ దేశాయిపేట జోన్ పరిధి చాలా పెద్దది. 70-75 శాతం కాలనీలకు ప్రతిరోజు, మిగిలిన 25 శాతం దినం విడిచి దినం నీటి సరఫరా చేస్తున్నట్లుగా ఇంజినీర్లు చెబుతున్నారు. లేబర్ కాలనీ, ఎస్సార్టీ కాలనీ, గొర్రెకుంట కీర్తినగర్ రిజర్వాయర్ల పరిధిలోనే సమస్యలున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎల్బీనగర్, కాశీబుగ్గ, అబ్బనికుంట, గిర్మాజిపేట, జీఆఆర్‌గుట్ట, మండిబజారు, మట్టెవాడ, రామన్నపేట, పాపయ్యపేట, సంతోషిమాత కాలనీతో పాటు విలీన గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. కొన్ని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందిస్తున్నారు.

అండర్ రైల్వేగేటు జోన్ పరిధిలో గత నాలుగైదేళ్లుగా రోజూ నల్లా ఇచ్చారు. రెండు, మూడు నెలలుగా పరిశీలిస్తే దినం విడిచి దినం సరఫరా జరుగుతుంది. పాత పైపులైన్లు, మిషన్ భగీరథ పైపులైన్లకు వేర్వేరుగా సరఫరా చేస్తున్నారు. ధర్మసాగర్ ఫిల్టర్‌బెడ్ నుంచి 60 మిలియన్ లీటర్ ఫర్ డే(ఎంఎల్‌డీలు) క్లియర్ వాటర్ ఇస్తున్నారు. కడిపికొండ, అమ్మవారిపేట వద్ద ప్రధాన పైపులైన్ వాల్వ్ ఆపరేటింగ్‌లో లోపం ఉంది. దీంతో వాటర్ ట్యాంకులు నిండటం లేదు. ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, శాంతినగర్, శివనగర్, ఖిలావరంగల్ కోట, చింతల్, పుప్పాలగుట్టతో పాటు విలీన గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది.

క్షేత్రస్థాయిలో సమస్యలివే..కాలనీలకు నీటి సరఫరా వాల్వులు తిప్పేందుకు ఉద్యోగుల కొరత ఉంది.సర్వీస్ రిజర్వాయర్ల పంపింగ్ షెడ్యూల్ లేదు. కాలనీల్లో లీకేజీలు ఎక్కువగా ఉన్నాయి. మిషన్ భగీరథ కనెక్షన్ల ద్వారా నీటి వృథా ఎక్కువగా ఉంది. కొన్ని కాలనీలకు ఇంత వరకు నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. చేతి పంపులు, మినీ స్టాటిక్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయి. లైన్లపై భారం పెరిగింది. ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోవడం లేదు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం- ప్రవీణ్‌చంద్ర, పర్యవేక్షక ఇంజినీర్, నీటి సరఫరా విభాగం

నగరంలోని అన్ని డివిజన్ల పరిధిలోని కాలనీలకు 90 శాతం తాగునీటి సరఫరా జరుగుతుంది. చిన్నచిన్న సమస్యలున్నాయి. వాటిని కూడా అధిగమిస్తాం. లీకేజీలు యుద్ధప్రాతిపదికన అరికడుతున్నాం. వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

శుద్ధ జలాలు అందని ద్రాక్ష

నర్సంపేట పట్టణంలో పాత, కొత్తగా వెలిసిన ఎనిమిది కాలనీల్లో ప్రజలకు శుద్ధ జలాలు అందడం లేదు. దీంతో ఆయా కాలనీల్లోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. 40 వేలకు పై చిలుకు జనాభా కలిగిన నర్సంపేట పట్టణంలో గత రెండున్నరేళ్ల నుంచి మిషన్ భగీరథ నీళ్లను పాత పైపులైన్లకు కనెక్షన్ ఇచ్చి సరఫరా చేస్తున్నారు. ఇప్పటి వరకు పైపులైన్లు లేని కొత్త కాలనీలు, కొన్ని పాత కాలనీల్లో ప్రజలకు శుద్ధ జలాల అందడం లేదు. రోజుకు 50 లక్షల లీటర్ల నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నా.. పూర్తిస్థాయిలో పైపులైన్ పనులు కానందున నీటికి ఇబ్బందులు తప్పడం లేదు.

రెండు నెలల్లో కనెక్షన్లు ఇస్తాం- వెంకటస్వామి, పుర కమిషనర్, నర్సంపేట

పట్టణంలో మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణ పనులు 85 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులతో పాటు ప్రధాన పైపులైన్ పనులు పూర్తి చేసి రానున్న రెండు నెలల్లో ఇంటింటికి శుద్ధ జలాలు అందిస్తాం.

# క్రీడా ప్రాంగణ ఏర్పాటులో నిర్లక్ష్యం

జగిత్యాల : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం చేరడం లేదు. పురపాలికల్లోని చిన్నారులు ఆటలు ఆడుకునేందుకు వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మెట్‌పల్లి బల్దియా పరిధిలోని 26 వార్డుల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రగతి నిధులు రూ. 30 లక్షలు కేటాయించారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాల కొరతతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పటివరకు 13 మాత్రమే ఏర్పాటు చేశారు.

అవగాహన కరవు

ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణంలో వాలీబాల్ కోర్ట్, ఖోఖో, కబడ్డీ కోర్టులతో పాటు పలు రకాల వ్యాయామ పరికరాలు, లాంగ్‌జంప్, తదితర వాటిని




ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. స్థలాల కొరతతో పరికరాలు బిగించి వదిలేస్తున్నారు. ఆయా వార్డులలో ఏర్పాటు చేసిన ప్రాంగణాలపై అవగాహన కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

గేట్‌వాల్వ్ గుంత

పట్టణంలో ఫిల్టర్‌బెడ్ వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో సగం వరకు ఫిల్టర్‌హౌజ్‌లు, గేట్‌వాల్స్, పెద్ద సంపు, ఉద్యోగులు ఉండే మూడు గదులు ఉంటాయి. ఇవన్నీ ఉండగా ఇక్కడే క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. ఇందులో వాలీబాల్ కోర్ట్ ఏర్పాటు చేశారు. దీనిని ఆనుకునే మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ గుంత ఉండడంతో ఎలా ఆడాలని క్రీడాకారులు వాపోతున్నారు. కళానగర్‌లోని సరస్వతి శిశుమందిరం ప్రైవేటు పాఠశాలలో క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ముగిసిన తర్వాత యాజమాన్యం గేట్‌కు తాళం వేసి వెళ్తారు. ఈ విషయంపై బల్దియా ఏఈ అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా క్రీడాప్రాంగణాలను వార్డుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్థలాల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, స్థలాలు ఉన్నచోట్ల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# తీరనున్న తాగునీటి సమస్య

కరీంనగర్ : కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, విలీన కాలనీల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళికలు చేశారు. జిల్లాలో కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలున్నాయి. రెండు పురపాలికలు కొత్తగా ఏర్పాటు కావడంతో, మిగతా వాటిల్లో సమీప గ్రామాలను విలీనం చేయడంతో తాగునీటికి కటకట తప్పడం లేదు. కొత్తపల్లి మున్సిపాలిటీలో నల్లానీరు తాగడానికి కూడా పనికి రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. తాగునీటి వసతి మెరుగుపర్చాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నప్పటికీ నిధులు లేక ఇప్పటికీ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

భగీరథలో జాప్యంవేసవిలో మున్సిపాలిటీలు, విలీన కాలనీల్లో రూరల్ మిషన్ భగీరథ కింద తాగునీరు రాక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో 10 లక్షల లీటర్ల ట్యాంకు గంటన్నరలో నిండుతుండగా, రూరల్ మిషన్ భగీరథ ద్వారా నిర్మించిన లక్ష లీటర్ల ట్యాంకు 20 గంటలు పడుతుంది. దీంతో నీటి సరఫరాకు జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల నగరపాలిక రూ. 5.50 కోట్లతో కొత్తగా తాగునీటి పైపులైను వేయగా అత్యధిక ప్రాంతాల్లో పనులు పూర్తి చేసి నీటి సరఫరాను మెరుగుపర్చారు. మిగతా భాగంలో పనులు కొనసాగుతు న్నాయి.

అంచనాలు తయారు

రోజు తాగునీరు సరఫరా చేసేందుకు అమృత్ కింద విలీన కాలనీలు, కొత్త మున్సిపాలిటీల్లో పైపులైన్లు, రిజర్వాయర్లు విస్తరించేందుకు ప్రతిపాదనలు చేశారు. రానున్న పాతికేళ్ల జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రజారోగ్యశాఖ అంచనాలు తయారు చేసింది. ప్రభుత్వం ద్వారా అనుమతి రాగానే టెండర్లు పిలిచే అవకాశముంది. ఈ పనులు ప్రారంభించిన ఏడాదిలోగా పూర్తి చేసి ఇంటింటా తాగునీరు సౌకర్యం కల్పించనున్నారు.

పనుల వివరాలు ఇలా.. కరీంనగర్ నగరపాలిక పరిధిలో 10 ఎంఎల్‌డీల ఫిల్టర్‌బెడ్‌ను ఆధునికీకరణ చేయనున్నారు. 1100కేఎల్ సామర్థ్యంతో వాటర్ సంపు నిర్మాణం, మూడు పంపుసెట్లు, 9.61



కిలోమీటర్లు రేకుర్తి వరకు పంపింగ్ లైన్, ఫీడర్ లైన్, పైపులైను విస్తరణ, పంపుహౌజ్ నిర్మాణం, 400కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ తదితర పనులున్నాయి.

కొత్తపల్లి మున్సిపాలిటీలో స్టోరేజీ రిజర్వాయర్, ఫీడర్, సరఫరా పైపులైన్ల విస్తరణ, 3ఎంఎల్‌డీ శుద్ధి కేంద్రం, ట్రాన్స్‌ఫార్మర్, ఇంటింటా నల్లా కనెక్షన్లు, మోటార్లు ఉన్నాయి.

హుజురాబాద్‌లో ఫీడర్‌మెన్స్, పైపులైన్ల విస్తరణ, ఇంటింటా నల్లా కనెక్షన్లు 2 వేల కేఎల్ రిజర్వాయర్, ప్రహరీ, క్వార్టర్స్ నిర్మాణ పనులున్నాయి.చొప్పదండిలో స్టోరేజీ రిజర్వాయర్, పైపులైన్ల విస్తరణ, ఇంటింటా నల్లా కనెక్షన్లు, పంపుహౌజ్, జనరేటర్, రెండు చోట్ల వెయ్యి కేఎల్ సామర్థ్యంతో రిజర్వాయర్లు, క్వార్టర్లు, కాంపౌండ్‌వాల్ వంటి పనులు ఉన్నాయి.జమ్మికుంటలో స్టోరేజీ రిజర్వాయర్, పైపులైను విస్తరణ, ఇంటింటా నల్లాలు, నల్లా సౌకర్యం లేని ప్రాంతానికి కొత్తగా లైన్లు వేయడం పనులు చేస్తారు.

పరిపాలన అనుమతి రావాలి

సంపత్‌రావు, ఈఈ, ప్రజారోగ్యశాఖ, కరీంనగర్

విలీన కాలనీలు, కొత్త మున్సిపాలిటీల్లో తాగునీటి వసతి కల్పించేందుకు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. పరిపాలన అనుమతి రాగానే ఈఎన్‌సీ స్థాయిలో టెండర్లు పిలుస్తారు.

# ప్రజల కోసమే చంద్రబాబు పోరాటమంటూ.. నారా లోకేశ్ భావోద్వేగం



మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం అహర్నిశలు కష్టపడిన ప్రజా నాయకుడు తెదేపా అధినేత చంద్రబాబు అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో లోకేశ్ ప్రసంగం గద్గద స్వరంతో సాగింది. ప్రజల కోసం పోరాడిన నాయకుడు చంద్రబాబు అంటూ సమావేశ వేదికపైనే కన్నీరు పెట్టుకున్నారు. తెలుగుదేశం-జనసేన పోరాడకుంటే రాష్ట్రాన్ని జగన్ ముక్కలు చేసి అమ్మేసేవాడని మండిపడ్డారు. తెలుగుదేశం-జనసేన కలిస్తే 160 స్థానాలు ఖాయమని స్పష్టం చేశారు. ఏ తప్పు చేయకున్నా చంద్రబాబును జైల్లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బే సంపాదించాలని చంద్రబాబు భావిస్తే రాజకీయాలు అవసరం లేదన్నారు.

**జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారు :** "2019లో ఒక్క ఛాన్స్ అంటే జగన్‌ను గెలిపించారు. నియంత మాదిరిగా జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల్లోకి తోసేశారు. సైకో జగన్ మొదటి నిర్ణయం.. ప్రజల కోసం కట్టిన ప్రజావేదిక కూల్చడం. దళితులు, బీసీలు, మైనారిటీలు, అనేకమంది తెదేపా నాయకులపై వేల కేసులు పెట్టించారు. రాష్ట్రానికి చంద్రబాబు అనేక పరిశ్రమలు తీసుకొచ్చారు. వేలమంది నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పించారు. పరిశ్రమలు తీసుకొచ్చి, ఉద్యోగాలు కల్పించినందుకు చంద్రబాబును జైలుకు పంపించారా? అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినందుకు చంద్రబాబును బంధించారా? జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయడం ఆయన చేసిన నేరమా? సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారని ప్రశ్నించడం చంద్రబాబు తప్పా? ఇతర రాష్ట్రాల రాజధానులకు దీటుగా మన రాజధాని ఉండాలని అహర్నిశలు కష్టపడినందుకు చంద్రబాబును బంధించారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరడం తప్పా? ఇసుక దోపిడీ, కల్తీ మద్యంపై మాట్లాడడం.. కరెంటు, ఆర్టీసీ ఛార్జీలు, పన్నులు తగ్గించాలని అడగడమే ఆయన చేసిన నేరమా? కుటుంబం గురించి ఒక్క క్షణం కూడా పట్టించుకోకుండా అహర్నిశలు ప్రజల గురించే చంద్రబాబు ఆలోచించారు. పేదవాళ్లు శాశ్వతంగా పేదరికం నుంచి బయటకు రావాలని కష్టపడ్డారు.

**మా అమ్మను బెదిరిస్తున్నారు :** ఏనాడైనా మా అమ్మ బయటకొచ్చారా? చివరకు మా తల్లిపైనా కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. ఏనాడు ప్రభుత్వ కార్యక్రమాలకు మా అమ్మ రాలేదు.

అసెంబ్లీ సాక్షిగా ఈ సైకో జగన్, ఆయన సైన్యం ఆమెను అవమానించారు. సేవా కార్యక్రమాలు తప్ప రాజకీయాలు నా తల్లికి తెలియదు. గవర్నర్‌ను కలిసేందుకు కూడా వెళ్లలేదు. చంద్రబాబుకు పంపించే భోజనంలో విషం కలుపుతారని మాపై ఆరోపణలు చేస్తున్నారు. భోజనాల్లో విషం కలపడం, కోడికత్తి డ్రామాలు మా డీఎన్ఏలోనే లేవు. చంద్రబాబు ఇచ్చిన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.



# రాజేకు సీటు ఫిక్స్.. గహ్లోత్, పైలట్ పోటీ ఎక్కడినుంచంటే?

రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. గెలుపు గుర్రాల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు ముమ్మర కసరత్తులు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే అధికార కాంగ్రెస్ పార్టీ శనివారం అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేయగా.. అటు భాజపా కూడా 83 మందితో రెండో జాబితాను ప్రకటించింది.

**ఝల్రాపటన్ నుంచే రాజే పోటీ..** రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడంపై గత కొంతకాలంగా సందిగ్ధత నెలకొన్న విషయం తెలిసిందే. ఆ ఊహాగానాలకు తెరదించుతూ నేడు వెల్లడించిన జాబితాలో రాజే పేరును భాజపా ప్రకటించింది. తన కంచుకోట ఝల్రాపటన్ నుంచే ఆమెను బరిలోకి దించింది. ఈ నియోజకవర్గం నుంచి ఆమె ఇప్పటికే 4 సార్లు విజయం సాధించారు. ఇక, మేవాఢ్ వీరుడు మహారాణా ప్రతాప్ సింగ్ వారసుడు విశ్వరాజ్ సింగ్ మేవాఢ్‌ను నాథ్‌ద్వారా నుంచి నిలబెట్టింది. ఇటీవలే విశ్వరాజ్ భాజపాలో చేరారు. అటు ప్రముఖ రాజకీయ నేత భైరాన్ సింగ్ షెఖావత్ అల్లుడు నర్పత్ సింగ్ రజ్వీకు కూడా తాజా జాబితాలో చోటు దక్కింది. 83 మందితో భాజపా నేడు రెండో విడత జాబితాను విడుదల చేయగా.. ఇప్పటివరకు 124 మంది అభ్యర్థులను ఖరారు చేసింది.

**కాంగ్రెస్‌లో మార్పుల్లేవ్..** అటు కాంగ్రెస్ కూడా శనివారం 33 మందితో అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. అయితే, ఇందులో పెద్దగా ఎలాంటి మార్పులు చేయలేదు. ఎప్పటిలాగే.. ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ సర్దార్‌పురా నుంచి, మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ టోంక్ నుంచి బరిలోకి దిగుతున్నారు. స్పీకర్ సీపీ జోషి.. నాథ్‌ద్వారా నుంచి పోటీ చేస్తున్నారు. రాజస్థాన్‌లో మొత్తం 200 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. కాంగ్రెస్ ఇంకా మెజార్టీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ ఆదివారం పార్టీ సీడబ్ల్యూసీ సమావేశం తర్వాత మరిన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో నవంబరు 25న ఎన్నికలు జరగనుండగా.. డిసెంబరు 3న ఫలితాలను ప్రకటించనున్నారు.

# రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ దసరా శుభాకాంక్షలు



తాడేపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. 'ముగ్గురమ్మల మూలపుటమ్మ అనుగ్రహం కోసం.. నవరాత్రుల్లో తొమ్మిది రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో దుర్గామాతను పూజిస్తారు చెడుపై.. మంచి, దుష్ట శక్తులపై.. దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే విజయదశమి. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలి. రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, ఆ కనకదుర్గమ్మ అమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ఉండాలి' అని సీఎం జగన్ ఆకాంక్షించారు.




# ఏపీ హైకోర్టు నూతన న్యాయమూర్తుల ప్రమాణం

అమరావతి: ఏపీ హైకోర్టు నూతన న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగింది.

నూతన న్యాయమూర్తులతో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఏపీ హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, హోం మంత్రి తానేటి వనిత, మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు తదితరులు పాల్గొన్నారు. హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా హరినాథ్ నూనెపల్లి, కనపర్తి కిరణ్మయి, జగడం సుమతి, న్యాపతి విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు.

కాగా ఇటీవల ఈ నలుగురు అడ్వొకేట్‌లను ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు సిఫార్సు చేసిన విషయం తెలిసిందే.



# హమాస్ చెరలో ఇంకా 210 మంది..!

గాజాలోని హమాస్ చెరలో బందీలుగా ఉన్న ఇజ్రాయెల్, ఇతర దేశాల పౌరుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం ప్రస్తుతం మిలిటెంట్ల వద్ద 210 మంది బందీలుగా ఉన్నట్లు ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్) అధికార ప్రతినిధి వెల్లడించారు. అయితే, ఇదే తుది సంఖ్య కాదని అన్నారు. కన్పించకుండా పోయిన వారి కోసం మిలిటరీ దర్యాప్తు కొనసాగుతోందని, ఆ తర్వాత బందీల సంఖ్య మరింత పెరగొచ్చని పేర్కొన్నారు. హమాస్ నిన్న ఇద్దరు అమెరికన్-ఇజ్రాయెల్ మహిళలను విడుదల చేసిన విషయం తెలిసిందే. వీరిద్దరూ కాకుండానే ఇంకా 210 మంది వారి వద్ద బందీలుగా ఉన్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. వీరిలో చిన్నారులు, వృద్ధులు కూడా ఉన్నారు.

**యుద్ధంలోకి హెజ్‌బొల్లా..** ఇదిలా ఉండగా.. ఈ యుద్ధంలో చేరాలని లెబనాన్‌లోని సాయుధసంస్థ హెజ్‌బొల్లా నిర్ణయించుకున్నట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలెంట్ ఆరోపించారు. అదే నిజమైతే.. తమపై దాడులకు వారు భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. గత కొన్ని రోజులుగా దక్షిణ లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా.. ఇజ్రాయెల్ సైన్యంపై దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. వీటిని ఐడీఎఫ్ ఎదుర్కొంటోంది. ప్రతిదాడుల్లో 13 మంది హెజ్‌బొల్లా సభ్యులు హతమైనట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది.

**హమాస్ రాకెట్లలో 550 వారి పౌరులపైనే..** గాజా స్ట్రిప్ నుంచి హమాస్, పీఐజే మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్లలో 550కి పైగా విఫలమయ్యాయని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి వెల్లడించారు. అవి వారి భూభాగంలోనే పడిపోయాయని పేర్కొన్నారు. "వారు తమ సొంత పౌరులనే చంపేస్తున్నారని" అని ఆరోపించారు.

# పేదలపై పెత్తందారీ పోకడలంటే ఇవే!: నారా భువనేశ్వరి



అమరావతి: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శ్రీకాకుళం నుంచి కుప్పం వరకూ సైకిల్ యాత్ర చేస్తున్న తెదేపా కార్యకర్తపై పుంగనూరులో వైకాపా నాయకుడు రెచ్చిపోయిన ఘటనపై నారా భువనేశ్వరి స్పందించారు. వైకాపా నేత తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "పుంగనూరు ఘటన పెత్తందారీ పోకడలకు నిదర్శనం. రాష్ట్రంలో రౌడీ రాజకీయానికి ఈ దాడి ఒక ఉదాహరణ. బిహార్‌లో కూడా ఇంత అరాచక పరిస్థితులు లేవు. పేదలపై పెత్తందారీ పోకడలు అంటే ఇవే. తెలుగుదేశం అంటే ఒక కుటుంబం. మా నేతలను అక్రమంగా జైలులో పెట్టారని నిరసన కూడా చేయకూడదా? కార్యకర్తలకు సైకిల్ యాత్ర చేసే హక్కు కూడా లేదా?సామాన్యులకు చేసిన అవమానం ప్రజలంతా గమనించారు. ఎల్లకాలం నియంతల పెత్తనం సాగదు. అంతిమ విజయం ప్రజాస్వామ్యానిదే" అని భువనేశ్వరి అన్నారు. ఈనెల 24న భువనేశ్వరి తిరుమల శ్రీవారిని దర్శించుకుని అదే రోజు చంద్రబాబు స్వగ్రామం నారా వారిపల్లికి వెళ్తారని తెదేపా విస్తృతస్థాయి సమావేశంలో నారా లోకేశ్ వెల్లడించారు. 25న చంద్రగిరి నియోజకవర్గం నుంచి 'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. చంద్రబాబు అరెస్టు వార్త విని ఆవేదనతో చనిపోయిన కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారు.



# ఆసుపత్రిలో భార్య కాన్పు దారిలోనే అనంతలోకాలకు భర్త

## మాటలకందని విషాదం.. బిడ్డకు జన్మనిచ్చిన ఆస్పత్రికే భర్త మృతదేహం

కారంపూడి: 3 గంటలుగా 3 ఆస్పత్రుల చుట్టూ 70 కి.మీ మేర గర్భిణి నరకయాతన.. చివరకు బిడ్డను ప్రసవించిన సమయానికి ఆస్పత్రికి భర్త మృతదేహం.. వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని సొంత జిల్లా పల్నాడులో జరిగిన మాటలకందని విషాదమిది. పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన రామాంజిని అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో.. శుక్రవారం రాత్రి 10గంటలకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య సదుపాయాలు సరిగా లేవని గురజాల ప్రభుత్వాస్పత్రికి వెళ్లమని వైద్యులు సూచించారు. దీంతో రాత్రి 11 గంటలకు గురజాల ఆస్పత్రికి వెళ్లారు. ఇక్కడ కూడా వైద్య సదుపాయాలు సరిగా లేవని 70 కి.మీ. దూరంలో ఉన్న నరసారావుపేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లమని వైద్యులు సిఫార్సు చేశారు. అయితే, నరసరావుపేట ఆస్పత్రి వద్దకు చేరగానే రామాంజిని ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇదే క్రమంలో కారంపూడి నుంచి గురజాల వరకు తోడుగా వచ్చిన ఆమె భర్త ఆనంద్ (40).. ఇంటికి వెళ్లి డబ్బులు తెస్తానని బయలుదేరాడు. బైక్‌పై ఇంటికి వెళ్లి తిరిగొస్తూ.. మార్గమధ్యంలో జోలకల్లు వద్ద రహదారిపై ఉన్న పెద్ద గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ఆనంద్‌ను నరసరావుపేటకు తరలించారు. ఆస్పత్రి వద్దకు చేరగానే ఆనంద్.. బిడ్డను చూడకముందుకే కన్నుమూశారు. దీంతో భార్యను దగ్గరుండి చూసుకోవాల్సిన భర్త విగత జీవుడిగా కనిపించడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. సాధారణ కాన్పు కూడా చేయలేని దయనీయ స్థితిలో కారంపూడి, గురజాల ఆస్పత్రులు ఉండటం, 70 కి.మీ దూరంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సి రావడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# దత్తపుత్రిక దాష్టీకం

## ప్రియుడితో కలిసి తల్లిని హతమార్చిన బాలిక

రాజమహేంద్రవరం : దంపతులిద్దరూ ప్రభుత్వ శాఖలో ఉద్యోగులు. సంతానం లేకపోవడంతో.. చిన్నారిని దత్తత తీసుకుని పెంచుకోవాలనుకున్నారు. అనుకున్న ప్రకారం ఓ పేద కుటుంబంలోని నెలల చిన్నారి (బాలిక)ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత తీసుకున్నారు. చిన్నారిని ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. ఆ బాలికే పెంపుడు తల్లికి యమపాశమవుతుందని వారు గ్రహించలేకపోయారు. రూ.కోట్ల ఆస్తికి వారసురాలు ఆ బాలికే కదా అని అడిగింది లేదనకుండా ఇచ్చారు. అదే పెంపుడు తల్లికి శాపంగా మారింది.

**13 ఏళ్ల బాలిక 19ఏళ్ల యువకుడితో ప్రేమాయణం..** 13 ఏళ్లకే ఆ బాలిక చెడు వ్యసనాల బారిన పడింది. పుట్టినరోజు వచ్చిందంటే రూ.లక్షల్లో ఖర్చు. 13 ఏళ్లకే.. 19 ఏళ్ల యువకుడితో ప్రేమాయణం. వారికి ఖరీదైన బహుమతులు ఇవ్వడం, ప్రియుడు, స్నేహితులతో కలిసి జల్సాలు చేయడం బాలికకు పరిపాటిగా మారింది. ఈ విషయం పెంపుడు తల్లికి తెలిసి మందలించడం మొదలు పెట్టింది. దీంతో తల్లి, కుమార్తెల మధ్య వివాదాలు మొదలయ్యాయి. తల్లి చెబుతున్న మాటలన్నీ తనపై ద్వేషంతో చెబుతున్నట్లుగా బాలిక భావించింది. తల్లి తనకు తలపోటుగా మారిందని ప్రియుడు, స్నేహితులతో చెప్పడంతో వారు బాలికకు అక్రమ మార్గం సూచించారు. వారు చెప్పిన మాటలకు బాలిక తలాడించడంతో.. తల్లిని అడ్డుతొలగించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ప్రమాదవశాత్తూ తల్లి స్నానాల గదిలో జారి పడి విశ్రాంతి తీసుకుంటున్న తరుణంలో ప్రియుడితోపాటు.. మరో ఇద్దరు స్నేహితులను అర్ధరాత్రి ఇంటికి రప్పించింది. తల్లి.. ముక్కు, నోరు తుండుతో నొక్కిపట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేయించింది. అనంతరం ఏమీ తెలియనట్లుగా ఆసుపత్రికి తీసుకువెళ్లింది. మృతదేహాన్ని పరిశీలించిన వైద్యులకు అనుమానం రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. విచారణలో మొత్తం విషయాలు బయటకు వచ్చాయి. కేసు వివరాలను డీఎస్పీ విజయ్‌పాల్ శనివారం మీడియాకు వెల్లడించారు.

# నేర నిరోధం, దర్యాప్తులో మన పోలీసులు దేశంలోనే అగ్రగామి

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సీఎం వైయస్ జగన్ ట్వీట్



తాడేపల్లి: సమాజ భద్రత కోసం తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడే పోరాడ యోధుడే పోలీస్ అని ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సీఎం వైయస్ జగన్ ట్వీట్ చేశారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నేడు మన ప్రభుత్వం తరఫున నిర్వహించాం. ఈ ఏడాది మన రాష్ట్రంలో విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సోదరుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా మాట ఇస్తున్నాను. సమాజ భద్రత కోసం తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడే పోరాట యోధుడే పోలీస్. అధునాతన వ్యవస్థలను ఉపయోగించుకుని నేరాలకు పాల్పడుతున్న వారిని ఎదుర్కోవలసిన బాధ్యత నేటి పోలీసులపై ఉంది. నేర నిరోధం, నేర దర్యాప్తులో మన రాష్ట్ర పోలీసులు అత్యాధునిక సైబర్ టెక్నాలజీని ఉపయోగిస్తూ దేశంలోనే అగ్రగామిగా ఉన్నారు. ఈ విభాగంలో నియమించిన 130 మంది సాంకేతిక పోలీసింగ్ నిపుణుల పనితీరు మన ప్రజలకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోంది అని సీఎం వైయస్ జగన్ ట్వీట్ చేశారు.

# అల్ట్రా మోడ్రన్ దేవతా సుందరి

ఈ అందాన్ని అలా చూస్తే ఎవరైనా స్టన్నయిపోవాల్సిందే. ఇద్దరు కిడ్స్ కి మమ్మీ అని చెప్పినా ఎవరూ నమ్మరు. మామ్ అయ్యాక అంతగా మేకోవర్ చూడగానే బెబో కరీనా కపూర్ కమిట్ మెంట్ ని పొగిడేయకుండా ఉండలేరు. బెబో ఈజ్ బ్యాక్. లేటెస్ట్ స్టన్నింగ్ ఫోటోషూట్ ఇప్పుడు అభిమానుల్లో హాట్ టాపిక్ గా మారింది. జీరో సైజ్ కి బ్రాండ్ అంబాసిడర్ గా కొనసాగిన కరీనా కపూర్ ఖాన్ ఇప్పటికీ తన రూపంలో పెద్దగా మార్పు లేదని నిరూపిస్తోంది. దానికోసం బెబో జిమ్ లో కసరత్తులు, యోగా, మెడిటేషన్ విషయంలో ఎంతో కమిట్ మెంట్ ని కలిగి ఉంటుందని సన్నిహితులు చెబుతుంటారు. బెబో తాజా ఫోటోషూట్ ఒకటి ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. 'హౌస్ ఆఫ్ మసాబా'కు బెబో కరీనా ముఖ చిత్రంగా మారింది. ఈ ఫోటోషూట్ లో కరీనా రకరకాల డిజైనర్ దుస్తుల్లో అందంగా కనిపించింది. ముఖ్యంగా బ్లాక్ మఖమల్ డిజైనర్ డ్రెస్ దానిపై క్రిస్టలైన్ గోల్డ్ డిజైన్స్ తో రూపొందించిన షేడెడ్ లుక్ తన అందాన్ని పదింతలు పెంచిందనడంలో సందేహం లేదు. బెబో టోన్డ్ బాడీ షేప్ ని ఈ డ్రెస్ మరింత ఎలివేట్ చేయడం ఇంట్రెస్టింగ్. "కరీనా టైమ్‌లెస్.. నేను ఈ ప్రచారానికి కాలాతీత ముఖాన్ని కోరుకున్నాను. ఆమె తన జీవితంలో లేదా కెరీర్‌లోని ప్రతి దశలో అత్యంత ఆత్మ విశ్వాసంతో ఉంది" అని మసాబా తన పోస్ట్ లో రాసారు. ఈ సంఘం బలం, స్వాతంత్ర్యం వ్యక్తిత్వాన్ని మూర్తీభవించిన వధువులకు నివాళులర్పించే రూపమిది. ఈ ప్రచారం ఒక




లేఖ..కరీనాకు ధన్యవాదాలు అని డిజైనర్ మసాబా గుప్తా తెలిపారు. కొత్తదనాన్ని ట్రెండ్‌గా మార్చే వరకు జనం మెచ్చుకోరు. మసాబాతో మీ అనుబంధం చాలా కొత్తది.. విభిన్నమైనది. శుభాకాంక్షలు క్వీన్ అని ఒక అభిమాని ప్రశంసించగా, క్యా సుందర్ లడ్కీ అంటూ మరో అభిమాని ఫైర్ ఈమోజీని షేర్ చేసారు. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది.

**మర్డర్ మిస్టరీలో బెబో :** స్కాం 1992 దర్శకుడు హన్సల్ మెహతా దర్శకత్వం వహించిన 'ది బకింగ్‌హామ్ మర్డర్స్' %దీఖీ×% లండన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2023లో వరల్డ్ ప్రీమియర్ కి కరీనా హాజరైంది. ఈ వేదికపై మేకర్స్ మొదటి అధికారిక పోస్టర్‌ను విడుదల చేసారు. ఈ చిత్రంలో డిటెక్టివ్‌గా నటించిన కరీనా కపూర్, ఈ చిత్రానికి ప్రేరణగా నివేదించబడిన ఎమ్మీ అవార్డు గెలుచుకున్న %ఎదీూ% డ్రామా అయిన 'మేర్ ఆఫ్ ఈస్ట్ టౌన్' షేడ్స్‌లో కనిపిస్తుంది. ఫస్ట్ పోస్టర్‌లో కరీనా ఇంటెన్స్ లుక్ ఆకట్టుకుంది. ద బకింగ్‌హామ్ మర్డర్‌కి సంబంధించిన ఫస్ట్ అఫీషియల్ లుక్ పోస్టర్ నిజంగానే సినిమా చూడాలనే ఉత్సాహాన్ని పెంచింది. ఇద్దరు పోలీసులు నిర్బంధిస్తుంటే వారి నుంచి విడిపించుకునేందుకు కరీనా కపూర్ ప్రయత్నిస్తోంది. ఈ పోస్టర్ ఎంతో క్యూరియాసిటీ పెంచింది. డిటెక్టివ్ గా తల్లిగా డ్యూయల్ షేడ్ ఉన్న పాత్రలో కరీనా నటిస్తోంది. ఈ పోస్టర్ బ్లాక్ అండ్ వైట్ లో పాత బ్రిటిష్ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తోంది. ఈ చిత్రం పూర్తిగా లండన్‌లో తెరకెక్కింది. 80శాతం ఆంగ్లంలో 20శాతం హిందీలో ఉంటుంది. మేర్ ఆఫ్ ఈస్ట్‌టౌన్‌లో టైటిల్ క్యారెక్టర్‌గా కేట్ విన్స్‌లెట్ నటించారు. ఇప్పుడు అదే పాత్రను కరీనా పోషిస్తోందనేది టాక్.

# 200 కోట్ల ఆస్తితో అత్యంత ధనిక భారతీయ గాయని

భారతదేశంలో ఎందరో గొప్ప గాయనీమణులు ఉన్నారు. దశాబ్దాల పాటు తమ గానంతో ప్రపంచవ్యాప్తంగా అసాధారణ ఫాలోవర్లను సంపాదించుకున్నారు. అభిమానమే చాలా మందికి సంపద. శ్రేయా ఘోషల్, సునిధి చౌహాన్, నేహా కక్కర్ ఇప్పుడు భారతదేశంలోని అగ్రశ్రేణి మహిళా గాయకులుగా రికార్డుల్లో ఉన్నారు. లెజెండరీ ఆశా భోంస్లే దశాబ్దాలుగా పాడుతున్నారు. భారతీయ సంగీత పరిశ్రమలో ఆమె తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఈ గాయకులందరూ చాలా డబ్బు, కీర్తిని సంపాదించడంలో విజయం సాధించారు. అయితే భారతదేశంలో అత్యంత ధనిక మహిళా గాయని ఎవరు? అంటే ఆ పేరు ఇప్పటివరకూ మిస్టీరియస్ అని చెప్పాలి.



బయటి ప్రపంచానికి అంతగా తెలియని యువ గాయని ప్రముఖ గాయనీమణులందరి కంటే ముందుంది. మనం మాట్లాడుకుంటున్న గాయని తులసి కుమార్. రూ. 200 కోట్ల నికర ఆస్తి విలువతో భారతదేశంలోనే అత్యంత ధనిక మహిళా గాయని. తులసి కుమార్ ప్రముఖ సినీ నిర్మాత భూషణ్ కుమార్ సోదరి. దివంగత గాయకుడు టి-సిరీస్ వ్యవస్థాపకుడు గుల్షన్ కుమార్ కుమార్తె. తన సోదరి కుశాలి కుమార్ నటి. తులసి కుమార్ నికర ఆస్తి విలువ నేటితరం ట్యాలెంటెడ్ యువగాయనీమణులు శ్రేయా ఘోషల్, సునిధి చౌహాన్, నేహా కక్కర్ మొదలైన వారి మొత్తం సంపద కంటే చాలా ఎక్కువ. తులసి కుమార్ 2009లో 'లవ్ హెూ జాయే' ఆల్బమ్‌తో గాయనిగా కెరీర్ ప్రారంభించారు. అనేక సినిమాలకు పాడారు.

వాటిలో స్కూల్ లోని ముఝే తేరీ.. బిల్లు లోని 'లవ్ మేరా హిట్'.. వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ ముంబై లోని 'తుమ్ జో ఆయే' లాంటి చార్ట్ బస్టర్ పాటలు ఉన్నాయి. 37 ఏళ్ల గాయని హితేష్ రాల్హాన్‌ను 2015లో వివాహం చేసుకున్నారు. శ్రేయా ఘోషల్ నికర ఆస్తి విలువ రూ. 180-185 కోట్లు. సునిధి చౌహాన్ నికర ఆస్తి విలువ రూ. 100 కోట్లకు పైగా ఉండగా, ఆశా భోంస్లే నికర ఆస్తుల విలువ రూ. 80 కోట్లకు పైగా ఉన్నట్లు కథనాలొస్తున్నాయి. సింగింగ్ సెన్సేషన్ నేహా కక్కర్ ఆస్తి విలువ దాదాపు రూ.40 కోట్లు అని సమాచారం. వీళ్లందరి కంటే తులసి కుమార్ ఆస్తి విలువ ఎక్కువ.




# లేడీ డైరెక్టర్ క్లాసిక్ కి సీక్వెల్ ప్లాన్



భారతదేశంలో మహిళా దర్శకురాళ్ల వెల్లువ ఇటీవల పెరుగుతోంది. బాలీవుడ్ కోలీవుడ్ సహా టాలీవుడ్ లో కమర్షియల్ సక్సెస్ తో పాటు, అవార్డులు కొల్లగొట్టిన మహిళా దర్శకులు ఉన్నారు. సదరు మహిళా దర్శకురాలు కెరీర్ లో తెరకెక్కించిన సినిమాలన్నీ ఎంతో ప్రత్యేకమైనవి. బాక్సాఫీస్ వద్ద కమర్షియల్ సక్సెస్ తో పాటు, అవార్డులు రివార్డులు దక్కించుకున్న చిత్రాల్ని రూపొందించారు. ఇప్పుడు పరిశ్రమ టాప్ సెలబ్రిటీల వారసులను వెండితెరకు పరిచయం చేస్తూ నిరంతర వార్తల్లో నిలుస్తున్న ఓ ప్రముఖ మహిళా దర్శకురాలి ప్రయత్నం ఉత్కంఠ పెంచుతోంది. సదరు లేడీ డైరెక్టర్ ఇప్పుడు తన క్లాసిక్స్ లోని ఓ సినిమాకి సీక్వెల్ ని తెరకెక్కించే పనిలో ఉన్నారు. ఇంతకీ ఆమె ఎవరు? అంటే.. ది గ్రేట్ జోయా అక్తర్. జిందగిన మిలేగి దొబారా- గల్లీ బోయ్ లాంటి చిత్రాలను జోయా తెరకెక్కించారు. జిందగి న మిలేగి దొబారా .. బహుశా మన కాలంలో అత్యంత ఇష్టపడే ట్రావెల్ బేస్డ్ ఫిల్మ్. ఇది 2011లో విడుదలైనప్పుడు ఈ సినిమా కథలో ఆడియెన్ తమను తాము ఐడెంటిఫై చేసుకున్నారు. రిలేట్ అయ్యారు. అలాంటి అద్భుతమైన కథను చెప్పినందుకు ఈ చిత్రం అందరికీ నచ్చింది. ఈ చిత్రంలో అభయ్ డియోల్, ఫర్హాన్ అక్తర్ , హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా విడుదలైన 12 సంవత్సరాల తర్వాత, ఫర్హాన్ అక్తర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ZNMD 2 గురించి ప్రస్థావించడంతో ఆన్‌లైన్‌లో మరోసారి చర్చ మొదలైంది. బుధవారం నాడు అతడు పోస్ట్ చేసిన ఒక ఫోటోలో ఫర్హాన్ పోషించిన పాత్రను ఎలివేట్ చేసే ఫోటోని షేర్ చేసాడు. క్యాప్షన్‌లో ఇమ్రాన్ లుక్ పూర్తి వృత్తంలో.. జోయా ఏమి చెబుతారు ..? Boys మరొక రహదారి యాత్రకు వెళ్లాలా? అంటూ టీజ్ చేసాడు. ఈ పోస్ట్ తర్వాత ఇతర తారాగణం - జోయా కూడా దీనిపై వ్యాఖ్యలను జోడించారు. ఇది అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచింది. అభయ్ ఇలా రాసాడు. నేను 2012 నుండి నా చబాగ్ వతిని ప్యాక్ చేసాను. బోయ్స్ మిమ్మల్ని నిలబెట్టేది ఏమిటి? అని రాసాడు. బాగ్‌వతి అనేది ఈ సినిమా నుండి ఒక ముఖ్యమైన సింబల్. దీనిని అభిమానులు తక్షణమే గుర్తిస్తారు. ఫర్హాన్ పోస్ట్‌కి జోయా రిప్లై ఇచ్చింది. తన బాగ్‌వతి ప్యాక్ చేసానని తెలిపింది. హృతిక్ రోషన్ కూడా 'తక్కువ గూఓఓఓ! అంటూ రిప్లయ్ ఇచ్చాడు. దీంతో పాటు డ్యాన్స్ ఎమోజీని కూడా జోడించాడు. అంతేకాదు ఈ చిత్ర నిర్మాత రితేష్ సిధ్వానీ మాట్లాడుతూ.. నాకు రెండు మాటలు సత్య వచన్ అన్నారు. నెట్‌ఫ్లిక్స్ ఈ వ్యాఖ్యలను జోడించి, ఇన్సాన్ కా కర్తవ్యా హెూతా హై ఏక్ రోడ్ ట్రిప్ ప్లాన్ కర్నా అని చెప్పడం అంచనాలను మరింత పెంచింది. దాంతో రెండో భాగం నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్‌గా ఉండబోతుందా? అనే ప్రశ్న తలెత్తింది. ఈ పరిణామంతో అభిమానులు పిచ్చెక్కిపోతున్నారు. ఇది నిజమే అయితే జిందగినా.. సినిమాని అందులో గుర్తుండిపోయే పాత్రలను ఇష్టపడే ప్రతి ఒక్కరికీ ఇది చాలా ఆనందం కలిగించే వార్త. ఫర్హాన్ అక్తర్ ఇంతకుముందు అలియా భట్, కత్రినా కైఫ్, ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రలతో రోడ్-ట్రిప్ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాడని ప్రచారమైంది.

అయితే ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. జిందగీ నా మిలేగీ దొబారాను జోయా అక్తర్ - రీమా కగ్తీ కలిసి రచించారు. ఫర్హాన్ ఈ సినిమాలో నటించడమే కాకుండా డైలాగ్ లు రాశారు.

# సలార్: ముక్కు పుడక సూట్ కాలేదు రాజా




సలార్ పాన్ ఇండియాలో దుమ్ము దులపడం ఖాయమని అంచనా ఉంది. దానికి తగ్గట్టే ఒక్కో లుక్ రిలీజ్ చేస్తూ ప్రశాంత్ నీల్ బృందం వేడెక్కిస్తోంది. ఇప్పటికి అడపాదడపా ప్రభాస్ లుక్ తో పాటు, కొన్ని ఇతర కీలక పాత్రల లుక్ లను రిలీజ్ చేసారు. ఇందులో విలన్ గా నటించిన పృథ్వీరాజ్ లుక్ ఒకటి. తాజాగా నెట్టింట వైరల్ గా మారిన పృథ్వీరాజ్ సుకుమారన్ లుక్ పై రకరకాలుగా విశ్లేషణలు సాగుతున్నాయి. అతడి లుక్ చూడటానికి భీకరంగా కనిపించినా కానీ, కొన్ని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా అతడి సాఫ్ట్ అర్బన్ లుక్ కి సరిపోని ముక్కుపుడకపైనా అందరూ విమర్శిస్తున్నారు.

అసలు ఇది అతడికి ఏమాత్రం సూట్ కాలేదంటూ సూటి పోటి మాటలు అంటున్నారు జనం. 'సై' సినిమాలో ప్రదీప్ రావత్ కి సూటైంది ఆ ముక్కు పుడక.. అతడి భీకర రూపానికి మాస్ అప్పీల్ కి ఆ ముక్కు పుడక యాప్ట్.. అలాగే 'కేజీఎఫ్'లో విలన్లకు సూటబుల్..కానీ సలార్ లో పృథ్వీరాజ్ లుక్ చూడటానికి కొంత ఎబ్బెట్టుగా ఉందన్న విమర్శలొస్తున్నాయి. అతడు స్టైలిష్ గా పక్క పాపిడితో స్మార్ట్ గా సాఫ్ట్ బోయ్ లా ఉన్నాడు.. అందుకే ఆ ముక్కు పుడక సూట్ కాలేదు.. మాసిన గడ్డం గుబురు మీసకట్టు దానికి తగ్గట్టు తీక్షణమైన చూపులు.. ఎంపిక చేసుకున్న కాస్ట్యూమ్స్ ఇవన్నీ మాసీగా అనిపించినా కానీ, తీరుగ్గా తీర్చిదిద్దినట్టు ఉన్న ఆ హెయిర్ స్టైల్ కి మ్యాచింగ్ గా అనిపించడం లేదు. నిజానికి అడవిలో బిజిలీలు (గిరిజన అమ్మాయిలు) ముక్కు పుడకలతో కనిపిస్తారు. అది వారికి యాప్ట్. కోయదొరలు కూడా ముక్కు పుడకలతో కనిపించారు. అది వారికి సూటబుల్. కానీ ఇక్కడ సలార్ ఇలాఖాలో విలన్లకు ఈ ముక్కు పుడక ఎలా సూటవుతుందో.. అంత క్లాస్ లుక్ తో కనిపించే పృథ్వీరాజ్ కి ఈ ముక్కుపుడక పెట్టాలన్న ఆలోచన ఎలా వచ్చిందో కానీ, ప్రశాంత్ నీల్ పెద్ద తెరపై ఎలా జస్టిఫై చేస్తాడో చూడాలి. సలార్ డిసెంబర్ లో క్రిస్మస్ కానుకగా విడుదలవుతోంది. తెలుగు-తమిళం-కన్నడం-మలయాళం- హిందీ భాషల్లో అత్యంత భారీగా ఇది రిలీజవుతోంది. హెూంబలే ఫిలింస్ సంస్థ నిర్మిస్తోంది. ప్రభాస్ కథానాయకుడిగా నటించగా, ఇందులో శ్రుతిహాసన్ కథానాయికగా నటిస్తోంది.

# బోల్డ్ రోల్స్ తో కియారా ఆలోచనల్లో ఛేంజ్!

కియారా అద్వాణీ టాలీవుడ్..బాలీవుడ్ చిత్రాలతో బిజీ నాయికగా కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. హిందీ పరిశ్రమలో డై బై డే షైన్ అవుతూ దూసుకుపోతుంది. వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఓ ప్రత్యేకతని క్రియేట్ చేసుకుంటుంది. కరీనా కపూర్..కత్రినాకైఫ్..దీపికా పదుకొణే లాంటి సీనియర్ భామలున్నా! వాళ్లతో పోటీ పడి అవకాశాలు అందుకుంటుంది. ఇక బ్యూటీ తనలో బోల్డ్ నెస్ కెరీర్ ఆరంభంలోనే నిరూపించిన సంగతి తెలిసిందే. 'లస్ట్ స్టోరీస్' లో బోల్డ్ అటెంప్ట్ చేసి సక్సెస్ అయింది. అటుపై 'కబీర్ సింగ్' లో అంతే బోల్డ్ గా నటించి తానేంటో మరోసారి నిరూపించింది. దర్శకుల నటినని ఆరంభంలోనే చాటి చెప్పింది. అయితే ఇలా కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి రోల్స్ చేయడం ఎంతో పరిణితి చెందిన అంశంగా పేర్కొంది. 'మొదట్లో కథను ఎంచుకునే విషయంలో చాలా కష్టం అనిపించేది. ఇప్పటికీ కూడా అలాగే అనిపిస్తుంది(నవ్వుతూ).



దాని ద్వారా ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నాను. ఏది చేసినా కొంచెం భిన్నంగా చేయాలనే ఆలోచనతో నాకు తొచిన నిర్ణయాలు తీసుకుంటాను. 'లస్ట్ స్టోరీస్'..'కబీర్ సింగ్' పాత్రలకు ప్రశంసలతో పాటు విమర్శలు ఎదుర్కొన్నాను. కానీ ఆ పాత్రల ఎంపిక ద్వారా నాలో ఆలోచనా విధానం ఎలా ఉందని తెలిసింది. ఈ పాత్రలు నాకు చాలా సంతృప్తినిచ్చాయి. ఎలాంటి పాత్రలు ఎంచుకోవాలి అన్న దానిపై ఓ క్లారిటీ వచ్చింది. ప్రస్తుతం వ్యక్తిగత జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నాను. పెళ్లి కాక ముందు నుంచే సిద్ధార్థ్..నేను మా బంధాన్ని కాపాడుకోవాలనుకున్నాం. కానీ ఇప్పుడు నటీనటులుగా మాకున్న గుర్తింపును కాపాడుకోవడంపై దృష్టి పెట్టాం. సినీ రంగంలో మాకు ఓమంచి స్థానాన్ని ఏర్పరుచుకున్నాం. దీని కోసం మేము చాలా కష్టపడ్డాం. మావ్యక్తిగత జీవితంపై దృష్టి పెట్టి ప్రేక్షకుల అభిమానానికి దూరంగా ఉండాలనుకోవడం లేదు. మాపై వారికున్న ప్రేమ ఎప్పటికీ అలాగే ఉండాలని కోరుకుంటున్నా' అని అంది.

## టైగర్ నాగేశ్వరరావుకు ఎలా పడిందో కానీ..!

హీరోయిన్ల సోదరీమణులు తెరకు పరిచయం అవ్వడం రెగ్యులర్ గా చూసేదే. తెలుగు చిత్రసీమకు రాధ- భానుప్రియ - కాజల్- సంజన సహా పలువురి సోదరీమణులు పరిచయం అయ్యారు. ఇప్పుడు కృతి సనోన్ సోదరి నూపుర్ సనోన్ తెలుగు తెరకు పరిచయమవుతోంది. టైగర్ నాగేశ్వరరావు లాంటి భారీ పాన్ ఇండియా సినిమాతో ఈ నార్త్ భామ ఇంట్రో ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. నూపూర్ సనన్ అందచందాలకు ఇప్పటికే పరిశ్రమ వర్గాలతో పాటు కామన్ ఆడియెన్ స్పెల్ బౌండ్ అయిపోతున్నారు. అందానికి అందం ఒడ్డు పొడుగు ఉన్న ఈ భామ హాట్ లుక్స్ తో కిల్ చేస్తోంది. తాను తెలుగు తెరకు ఎలా పరిచయమైందో కూడా తాజా ఇంటర్వ్యూలో తెలిపింది ఈ బ్యూటీ. నిజానికి వంశీ సర్ (టైగర్ నాగేశ్వరరావు



దర్శకుడు)ని మొదటిసారి కలిసినప్పుడు.. ఇప్పుడు నన్ను కంట్రోల్ చేయడానికి మీ దగ్గర రిమోట్ ఉందని సరదాగా చెప్పాను. నాలోని మీ పాత్ర భావోద్వేగాలను తదనుగుణంగా సర్దుబాటు చేయండి.. అని చెప్పానని తెలిపారు. అక్టోబర్ 20న టైగర్ నాగేశ్వరరావు విడుదలకు సిద్ధంగా ఉంది. TNR తన తెలుగు అరంగేట్రం మాత్రమే కాదు.. తనకు పాన్ ఇండియా సినిమా అని కూడా నూపూర్ తెలిపింది. ఇది భారతీయ సంకేత భాషతో పాటు ఇతర దక్షిణ భారతీయ భాషలతో పాటు హిందీలో కూడా విడుదలవుతోందని ఆనందంగా చెప్పింది. నూపుర్ 2019లో అక్షయ్ కుమార్ సరసన ఒక మ్యూజిక్ వీడియోలో తొలిసారిగా కనిపించింది. ఆ తర్వాత ఈ మధ్యకాలంలో డిస్నీ ం హాట్‌స్టార్ ఒరిజినల్ కామెడీ షో పాప్ కౌన్ తో పాటు నవాజుద్దీన్ సిద్ధిఖీ సరసన నూరానీ చెహ్రా అనే హిందీ చిత్రంలోనూ నటించింది. ఇప్పటికే చెహ్రా విడుదల కావాల్సి ఉంది.

కానీ అది ఇప్పుడు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తుంది. అంతకుముందే TNR తో గ్రాండ్ గా ఎంట్రీ ఇస్తున్నాను. గొప్ప ప్రొడక్షన్ హౌస్ పెద్ద స్టార్లతో మంచి అవకాశ మిది. నా కోసం గొప్ప కథ, పాత్ర రాసారు. మేకర్స్ సినిమాను మార్కెట్ చేయడంతోపాటు నన్ను బాగా ప్రెజెంట్ చేసారు... అని తెలిపింది.




హైదరాబాద్: శాసనసభ ఎన్నికల తనిఖీల్లో భాగంగా పట్టుబడిన నగదు, మద్యం, ఆభరణాలు, కానుకల విలువ మొత్తం రూ. 300 కోట్ల మార్క్ దాటింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన అక్టోబరు 9న నుంచి ఇప్పటి వరకు తనిఖీల్లో పట్టుబడిన సొత్తు విలువ రూ. 307.2కోట్లకు పైగా ఉన్నట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు. గడచిన 24గంటల్లో రూ. 9.69కోట్ల నగదు పట్టుబడగా, ఇప్పటి వరకు పట్టుబడిన మొత్తం నగదు రూ. 105.58 కోట్లు. నిన్న ఉదయం నుంచి రూ. 1.35లక్షల విలువైన మద్యం పట్టుబడగా.. స్వాధీనం చేసుకున్న మొత్తం సరకు విలువ రూ. 13.58 కోట్లు. 24 గంటల్లో రూ. 72 లక్షల విలువైన 232 కిలోల గంజాయి పట్టుబడింది. గడచిన 24గంటల్లో రూ. 3.81 కోట్ల విలువైన బంగారం, 894 కిలోల వెండి, 190 క్యారెట్ల వజ్రాలు, 5గ్రాముల ప్లాటినం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 145.67 కోట్లు.

వీటితో పాటు రూ. 26.93 కోట్ల విలువైన ఇతర కానుకలు పట్టుబడ్డాయి. అక్టోబరు 20 ఉదయం నుంచి 24 గంటల్లో స్వాధీనాల మొత్తం విలువ రూ. 18.01 కోట

## ఉమ్మడి నల్లగొండ జిల్లాలో క్లీన్ స్వీప్.. 12 సీట్లు గెలవబోతున్నాం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాలకు 12 గెలువబోతున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. మన ఇంట్లో పుట్టిన కూతరికి పెళ్లి చేయాలంటే ఎంతో ఆలోచిస్తాం.. ఇచ్చే వ్యక్తి మంచోడా..? కాదా..? అని ఆలోచిస్తాం అని కేటీఆర్ తెలిపారు. ఒకటికి పదిసార్లు చెడు వ్యసనాలు ఏమైనా ఉన్నాయా? అని ఆలోచిస్తాం. మనింటి అమ్మాయిని వేరే ఇంటికి ఇవ్వాలంటేనే పది సార్లు ఆలోచించే మనం.. ఇంత కష్టపడి సాధించుకున్న ఈ రాష్ట్రాన్ని ఎవరి చేతుల పెట్టాలనేటప్పుడు ఆలోచించుకోవాల్నా..? వద్దా..? అని కేటీఆర్ అడిగారు. 46 రోజుల పాటు కాంగ్రెస్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి, జైలు శిక్ష అనుభవించిన చెరుకు సుధాకర్ సహా, జిట్టా బాలకృష్ణ, ఏపురు సోమన్న, హర్ దీప్ రెడ్డి లాంటి వాళ్ళ పార్టీలో చేరడం గొప్ప విషయం అని కేటీఆర్ అన్నారు.

నల్లగొండ జిల్లాలో 12కు 12 స్థానాల్లో బ్రహ్మాండమైన మెజార్టీతో గులాబీ జెండా ఎగురతదనే సంపూర్ణమైన విశ్వాసం వ్యక్తం చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్నవారి వద్ద కూడా చర్చ పెట్టండి. తెలంగాణ ఎలా అభివృద్ధి చెందిందో వివరించండి. అడ్వాన్స్‌గా విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. మంచి విజయం నల్లగొండ జిల్లాలో రావాలని కోరుకుంటున్నాను అని కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన చెరుకు సుధాకర్.. గులాబీ కండువా కప్పిన కేటీఆర్, హరీశ్‌రావు



హైదరాబాద్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, పీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు కలిసి చెరుకు సుధాకర్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, చిరుమర్తి లింగయ్య, గాయకుడు ఏపూరి సోమన్నతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. బీసీ నేతల విషయంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నేతల తీరును నిరసిస్తూ డాక్టర్ చెరుకు సుధాకర్ ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఏ పదవీ లేకపోయినా భరించవచ్చు గానీ ఆత్మగౌరవం లేని రాజకీయ ప్రయాణం నిష్ప్రయోజనం అని భావించి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో ఆర్థిక పరిపుష్టి కలిగిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని, మధుయాష్కీ వంటి బీసీల నేతల స్థాయిని తగ్గిస్తూ అవమానకరంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చెప్తున్న సామాజిక న్యాయం కేవలం రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ మాటల్లో తప్ప ఆచరణలో లేదని విమర్శించారు. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు సీట్లు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ చివరకు మోసం చేసిందని దుయ్యబట్టారు. బీసీలకు కేటాయించిన 12 సీట్లలో ఐదు చోట్ల ఎప్పుడూ కాంగ్రెస్‌కు డిపాజిట్ రాలేదని చెప్పారు. వీటిని పట్టుకుని బీసీలకు 12 సీట్లు ఇచ్చామంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెక్కిరింపు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పొన్నాల లక్ష్మయ్య రాజీనామా సమయంలో రేవంత్‌రెడ్డి అత్యంత అవమానకరంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## రాహుల్ గాంధీ గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడు



హైదరాబాద్: రాహుల్ గాంధీ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం నాడు తెలంగాణ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని మీడియాతో మాట్లాడుతూ.."చెరుకు సుధాకర్ పార్టీలోకి రావడం సంతోషంగా ఉంది. ఆయన కరుడుగట్టిన ఉద్యమ వాది. నకిరేకల్, ఆలేరు నియోజక వర్గం నుంచి పార్టీలో చేరుతున్న నేతలు, కార్యకర్తలందరికి స్వాగతం. ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డి ఒకవైపు, తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయని కిషన్‌రెడ్డి మరో వైపు ఉన్నారు. బీజేపీతో పోరాటం మా డీఎన్ఏలో ఉందని రాహుల్ గాంధీ అన్నారు. మరి రేవంత్‌రెడ్డి డీఎన్ఏలో ఏముంది మరి. రేవంత్‌రెడ్డి డీఎన్ఏలో ఏబీవీపీ ఉందా, బీజేపీ ఉందా.. బీఆర్ఎస్ ఉందా, టీడీపీ ఉందా, కాంగ్రెస్ ఉందా. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి డీఎన్ఏ మ్యాచ్ కావడం లేదు. కాంగ్రెస్ పార్టీకి పోటీ చేసేందుకు 35, 40 స్థానాల్లో అభ్యర్థులు కరువు అయ్యారు.

కాంగ్రెస్ పార్టీకి లెహార్ (గాలి)లేదు, జహర్ (విషం) ఉంది. కాంగ్రెస్ మేనిఫెస్టో మాది కాపీ కొట్టింది. కాంగ్రెస్ పార్టీ మత కలహాలు రేపుతది" అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

## పది రోజుల్లో రూ.2800 పెరిగిన బంగారం.. వెండిది కూడా అదే బాట.. కారణాలివి..!

దేవీ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భారతీయులు బంగారం కొనుగోళ్లు చేస్తుంటారు. శుభముహూర్తంలోనే బంగారంపై పెట్టుబడులు పెడుతుంటారు. ప్రభుత్వ బాండ్ల విలువ పడిపోవడంతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ద్రవ్యోల్బణం కట్టడికి వడ్డీరేట్లు పెంచక తప్పదని యూఎస్ ఫెడ్ రిజర్వ్ ప్రకటించడంతో డాలర్ విలువ బలహీన పడింది. ఫలితంగా ఇన్వెస్టర్లకు బంగారం ఆల్టర్నేటివ్ పెట్టుబడి ఆప్షన్‌గా మారింది. దీనికితోడు మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలతో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. గత వారం రోజులుగా దేశీయ మార్కెట్లో ఇటీవలి కాలంలో క్రమంగా బంగారం ధరలు పెరుగుతూ వచ్చాయి. పరిస్థితులు ఇలాగే సాగితే ధంతేరాస్, దీపావళి పర్వదినం నాటికి తులం బంగారం ధర రూ. 62 వేల మార్క్‌ను దాటేస్తుందని ఇండియన్ బులియన్ అండ్ జ్యువెల్లరీ అసోసియేషన్, బులియన్ మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నెల 12న హైదరాబాద్‌లో తులం బంగారం (24 క్యారట్లు) ధర రూ. 58,910 పలికితే, శనివారం (అక్టోబర్ 21) రూ. 61,750 పలుకుతోంది. అంటే పది రోజుల్లో రూ. 2840 పెరిగింది. మరోవైపు కిలో వెండి ధర ఈ నెల 12న రూ. 75,500 పలికితే, శనివారం రూ. 78,700 వద్ద ట్రేడయింది. అంటే రూ. 3200 పెరిగింది. ఢిల్లీలో శనివారం 24 క్యారట్ల బంగారం ధర తులం రూ. 200 పెరిగి రూ. 61,900 పలికింది. ఈ నెల 12న రూ. 59,060 వద్ద స్థిర పడింది. ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారట్ల బంగారం తులం ధర రూ. 54,150 (అక్టోబర్ 12) నుంచి శనివారం రూ. 56,750 వద్ద నిలిచింది. కిలో వెండి ధర ఈ నెల 12న రూ. 72,600 పలుకగా, శనివారం 75,300 వద్ద ట్రేడయింది. కర్ణాటక రాజధాని బెంగళూరు, మహారాష్ట్ర రాజధాని ముంబైలో 24 క్యారట్ల బంగారం తులం ధర రూ. 220 పెరిగి రూ. 61,750 వద్ద స్థిర పడింది. ఆభరణాల తయారీకి ఉపయోగించే 24 క్యారట్ల బంగారం తులం ధర రూ. 56,600 వద్ద ముగిసింది. కిలో వెండి ధర ఈ నెల 12న రూ. 72,600 పలికితే, ఈ నెల 21న రూ. 75,300 వద్ద ట్రేడయింది. చెన్నైలో ఈ నెల 12న తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ. 59,070 పలికితే, శనివారం రూ. 61,850 వద్ద స్థిర పడింది. ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారట్ల బంగారం ధర రూ. 54,150 నుంచి రూ. 56,700లకు పెరిగింది.




రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్ర భాజపాలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యమంత్రిగా అపార అనుభవం ఉన్న వసుంధరా రాజే పేరును తొలి జాబితాలో ప్రకటించని భాజపా.. ఆమెతోపాటు, ఆమె మద్దతుదారులు కొందరికి రెండో జాబితాలో చోటు కల్పించింది. మరోవైపు వసుంధరా రాజేకు ప్రత్యామ్నాయంగా 'దియా కుమారి'ని చూపించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. అసలు ఈ దియా కుమారి ఎవరు? అసలు రాజస్థాన్ భాజపాలో ఏం జరుగుతోంది? దేశంలో రాచరిక వ్యవస్థ కనుమరుగైనప్పటికీ.. రాజస్థాన్‌లో మాత్రం దాని ప్రభావం ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. 1951–52లో రాష్ట్రంలో తొలిసారి ఎన్నికలు జరిగినప్పటి నుంచి రాజకుటుంబాలకు చెందిన వ్యక్తులే అక్కడి రాజకీయాలను శాసిస్తున్నారు. కానీ, కేవలం వసుంధరా రాజే మాత్రమే ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. అధిష్ఠానంతో విభేదాల నేపథ్యంలో గత కొన్నాళ్లుగా ఆమెను పక్కన పెట్టిన భాజపా... ఆమెకు ప్రత్యామ్నాయంగా ప్రముఖ రాజ కుటుంబానికి చెందిన 'దియా కుమారి'ని తెరమీదకు తీసుకొచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా భాజపా తీసుకున్న నిర్ణయాలు కూడా ఈ వాదనకు బలం చేకూరుస్తున్నాయి.

**వ్యూహాత్మకంగా బరిలో దింపి..** రాజ్‌సమంద్ లోక్‌సభ ఎంపీగా ఉన్న ' దియా కుమారి'ని భాజపా అధిష్ఠానం ఆగమేఘాల మీద అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దింపింది. అంతేకాకుండా ప్రతిష్ఠాత్మక విద్యాధర్ నగర్ స్థానం నుంచి పోటీకి నిలిపింది. దీని వెనక కూడా పెద్ద వ్యూహమే ఉంది. 2018 ఎన్నికల్లో భాజపా 41 స్థానాలకు తొలి విడతగా అభ్యర్థులను ప్రకటించింది. కానీ, 40 చోట్ల పరాజయం చవి చూసింది. విజయం సాధించిన ఆ ఒక్క స్థానమే రాజసమంద్. అంతేకాకుండా అక్కడ పోటీ చేసిన భాజపా అభ్యర్థి నర్పత్ సింగ్ రజ్వీ 30 వేల ఆధిక్యంతో విజయం సాధించారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి భైరాన్ సింగ్ షెకావత్‌కు రజ్వీ అల్లుడు. ప్రస్తుతం వసుంధరా రాజే వర్గంలో ఆయన క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. అలాంటి వ్యక్తిని కాదని, భాజపాకు పెట్టని కోటగా ఉన్న ఆ స్థానాన్ని 'దియా కుమారి'కి కేటాయించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

**రాజే వర్గం వ్యతిరేకత** : భాజపా అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంపై వసుంధరా రాజే వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భైరాన్ సింగ్ షెకావత్ వారసత్వాన్ని భాజపా అగ్రనేతలు చులకనగా చూస్తున్నారంటూ రజ్వీ విమర్శల బాటపట్టారు. దశాబ్దాల కాలంగా రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసిన షెకావత్‌కు మీరిచ్చే గౌరవం ఇదేనా? అని దుయ్యబడుతున్నారు. ఏ మొహం పెట్టుకొని షెకావత్ శతవసంతాల వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారని రజ్వీ ఘాటు వ్యాఖ్యలు సంధిస్తున్నారు. ఏ అర్హతతో ఆ స్థానాన్ని దియా కుమారికి ఆ స్థానాన్ని కట్టబెట్టారన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఆ నియోజకవర్గ పార్టీ కేడర్‌తో ఎలాంటి సంబంధం లేని వ్యక్తికి ఆ స్థానాన్ని ఎలా కేటాయించారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కేవలం ఆమెకు సురక్షితమైన స్థానాన్ని కల్పించేందుకే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చన్న భావన వ్యక్తమవుతోంది. వసుంధర రాజేను పక్కన పెట్టడం ద్వారా ఏర్పడిన ఖాళీని భర్తీ చేసుకునేందుకే.. రాజవంశానికి చెందిన 'దియా కుమారి' అందలమెక్కిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**దియాకు ఆ సత్తా ఉందా? :** వసుంధరా రాజే, దియా కుమారి ఇద్దరూ ప్రముఖ రాజకుటుంబాల నుంచి వచ్చిన వారే. అయితే రాజేకు ఉన్న రాజకీయ అనుభవం దియా కుమారికి లేదు. దియా రాచరిక నేపథ్యాన్ని పక్కనపెడితే.. రాజకీయ పరిపక్వతపై పలు సందేహాలున్నాయి. ఆమె అనుచిత వ్యాఖ్యలతో తరచూ వివాదాల్లో చిక్కుకుంటుంటారు. ఆమె రాజకీయ మూలాలు కాంగ్రెస్ నుంచి ప్రారంభమయ్యాయి. ఆమె తండ్రి బ్రిగేడియర్ భవాని సింగ్ 1989లో కాంగ్రెస్ నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేసి ఓటమి చవి చూశారు. దియా కూడా ఇప్పటి వరకు కేవలం 2 ఎన్నికల్లోనే పోటీ చేశారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆమె, వ్యక్తిగత కారణాలతో 2018 అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో లోక్‌సభ ఎంపీగా విజయం సాధించారు. తాజాగా మళ్లీ విద్యాధర్ నగర్ నుంచి బరిలోకి దిగుతున్నారు. అపార అనుభవం ఉన్న రాజేను పక్కన పెట్టి.. పెద్దగా రాజకీయ అనుభవం లేని దియాకు ప్రాధాన్యత ఇవ్వడంపై పార్టీ వర్గాల్లో తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది.

**పార్టీలోకి తెచ్చి.. వైరం పెరిగి..** దియా కుమారిని భాజపాలోకి తీసుకొచ్చింది వసుంధరా రాజేనే. 2013 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ నిర్వహించిన ర్యాలీలో దియా కుమారిని ఆయనకు పరిచయం చేసి.. టికెట్ ఇప్పించేలా చేశారు. ఆ తర్వాతి కాలంలో వారిద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. క్రమంగా వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం పెరిగిపోయింది. జైపుర్‌లోని రాజ్‌మహల్ ప్యాలస్ హోటల్ విషయంలో 2016 లో దియా కుమారి, ఆమె తల్లి పద్మిని దేవి కలిసి వసుంధరా రాజేను బహిరంగంగా విమర్శించారు. ఈ విమర్శలు చినికిచినికి గాలివానలా మారాయి. చివరికి జైపుర్ డెవలప్‌మెంట్ అథారిటీ (జేడీఏ) ఆ ప్యాలస్ హోటల్‌ను సీజ్ చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆక్రమణల తొలగింపు విషయంలోనూ వీరిద్దరి మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. చివరికి రాజమాత పద్మినీదేవి తమ మద్దతు దారులతో వీధుల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో జేడీఏ వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఈ ఘటనతో రాజే–దియా మధ్య అఘాతం పూడ్చలేని విధంగా మారింది.

**ఆర్ఎస్ఎస్‌తో విభేదాలు :** వసుంధరా రాజే 2003లో ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలోని ఆర్ఎస్ఎస్‌తో విభేదాలు కొనసాగుతున్నాయి. రాజేకు ప్రత్యామ్నాయంగా కచ్చితంగా వేరొకరిని తయారు చేయాలని ఆర్ఎస్ఎస్ ఎప్పట్నుంచో యోచిస్తోంది. ఈ క్రమంలోనే దియాకు 2019లో లోక్‌సభ సీటు దక్కిందని చెబుతుంటారు. అదే సమయంలో భాజపాలో అత్యున్నత నిర్ణయాధికారం కలిగిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా తోనూ రాజేకు సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రాజేకు పోటీగా దియా పేరును భాజపా అధిష్ఠానం తెరమీదకు తీసుకొచ్చింది. రాజకీయాన్ని పక్కనపెడితే దియా వ్యక్తిగత జీవితం కూడా అప్పట్లో చర్చనీయాంశమైంది. దియా 1990లో ప్రేమవివాహం చేసుకున్నారు. దీనిపై కుటుంబం నుంచే కాకుండా రాజ్‌పుత్ సంస్థల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దాదాపు 10 ఏళ్లపాటు వైవాహిక జీవితం గడిపిన ఆమె 2019లో విడాకులు తీసుకున్నారు.

**దియానే ఎందుకు? :** రాష్ట్రంలో పార్టీ కీలక నేతగా వ్యవహరిస్తున్న వసుంధరా రాజే అధిష్ఠానానికి వ్యతిరేంగా వ్యవహరిస్తుండటం.. అదే సమయంలో దియా కుమారి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండటం ఆమెకు బాగా కలిసొచ్చింది. పెద్దగా రాజకీయ అనుభవం లేకపోయినా? ఎన్నో వివాదాల్లో ఉన్నా.. భాజపా పెద్దలు వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. 2018 ఎన్నికల్లో ఆమె పోటీకి దూరంగా ఉన్నప్పటికీ.. భాజపా కార్యాలయ నిర్మాణానికి ఆమె సొంత స్థలాన్ని ఇచ్చారు. అంతేకాకుండా ఇటీవల ప్రధాని మోదీ జైపుర్‌లో నిర్వహించిన పరివర్తన్ యాత్రను ఆమె ముందుండి నడిపించారు. దియాను పార్టీ పెద్దలు వెనకేసుకొస్తున్నప్పటికీ.. ఆమె రాజకీయ పరిపక్వతపై పార్టీ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాకుండా తాజా అసెంబ్లీ ఎన్నికల్లో రాజేకు ప్రత్యామ్నాయంగా పని చేయగల ఆమె సామర్థ్యంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దియా మద్దతుదారులు మాత్రం ఈ వాదనలను కొట్టి పారేస్తున్నారు. ఎవరికైనా అవకాశం వచ్చినప్పుడే వారేంటో నిరూపించుకుంటారని అంటున్నారు. రాజేకు కచ్చితంగా ప్రత్యామ్నాయంగా ఎదుగుతారని బలంగా చెబుతున్నారు. అయితే, రాజస్థాన్ రాజకీయ సంక్లిష్టత నేపథ్యంలో వర్గ పోరును జయించి.. అధికార కాంగ్రెస్‌ను భాజపా ఎలా ఎదుర్కొంటుందో చూడాలి మరి.

## ప్రవళిక ఆత్మహత్య కేసులో సంబంధం లేని గిరిజన యువకుడిని ఇరికించారు



హైదరాబాద్: ప్రవళిక ఆత్మహత్య కేసులో సంబంధం లేని గిరిజన యువకుడిని ఇరికించారని మాజీమంత్రి రవీంద్రనాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ..."కేసీఆర్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని గిరిజనులకు రవీంద్రనాయక్ పిలుపునిచ్చారు. డీసీపీ తన ఉద్యోగం కోసం గిరిజన యువకుడిని అన్యాయంగా ఇరికించారు. ప్రభుత్వ అసమర్థ నిర్వాకం వల్లే ప్రవళిక ఆత్మహత్య చేసుకుంది. ప్రవళిక తల్లిదండ్రులను ప్రగతి భవన్‌కు పిలిపించుకుని ప్రలోభ పెట్టారు. లేని కట్టుకథను అల్లి శివరాంను కేసులో అన్యాయంగా ఇరికించారు. ఆధారాలు లేవని కోర్టు చెప్పినా.. అరెస్ట్ చేయటం దుర్మార్గం. ప్రవళిక ఆత్మహత్యను ప్రేమ వ్యవహారంగా కేసీఆర్ ప్రభుత్వం చిత్రీకరించింది. ఎన్నికల్లో ఇబ్బంది అవుతోందని.. తల్లిదండ్రులను ప్రగతి భవన్‌కు పిలిపించి మంత్రి కేటీఆర్ మాట్లాడారు. 12శాతం రిజర్వేషన్లు, పోడు పట్టాల పేరుతో.. కేసీఆర్ గిరిజనులను రెండుసార్లు మోసం చేశాడు. గిరిజనులపై అత్యాచారాలను నియంత్రించటంలో ప్రభుత్వం విఫలం అయింది" అని రవీంద్రనాయక్ పేర్కొన్నారు.

## మురళీ ధరన్‌తో కాంగ్రెస్ కీలక నేతల అత్యవసర భేటీ.. కారణమేంటంటే..?

ఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణపై తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ అధ్యక్షులు, ఏఐసిసి జనరల్ సెక్రెటరీ మురళీ ధరన్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలతో కేసి వేణుగోపాల్ నివాసంలో అత్యవసరంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రేవంత్‌రెడ్డి, మానిక్ రావ్ ఠాక్రే, ఉత్తమ్ కుమార్ , భట్టి విక్రమార్క మరి కాసేపట్లో సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో ప్రధానంగా కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీపీఎం సీపీఎం పార్టీలతో చర్చలు జరుగుతున్నాయి. ఈరోజు రాత్రి కానీ రేపు ఉదయం కానీ మిగతా అభ్యర్థులను ఏఐసీసీ అధిష్ఠానం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. మొదటి విడతలో 55 మంది అభ్యర్థుల పేర్లను ఏఐసీసీ విడుదల చేసింది. లెఫ్ట్ పార్టీల పొత్తుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## బీజేపీ బీసీల గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉంది

మహబూబ్‌నగర్: బీజేపీ పార్టీ బీసీల గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవ చేశారు. మంగళవారం నాడు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ..."బీసీ ప్రధాని ఉన్నాడు.. బీసీలకు ఏమి చేశాడు. ఒక బీసీ మంత్రిత్వ శాఖ లేదు. బీసీ జన గణనకు తావు లేదు. 80 వేల కోట్ల జనాభా ఉన్న బీసీలకు 2 వేల కోట్ల బడ్జెట్ కూడా ఇవ్వలేదు. ఇలాంటి మీరు ఇప్పుడు ఓడిపోయే స్థానాల్లో బీసీలని నిలబెట్టి ఓడించే కుట్ర చేస్తున్నారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించి ఉంటే.. 33 శాతం బీసీలకు రిజర్వేషన్ వచ్చే అవకాశం ఉండేది. కేవలం ఎమ్మెల్యేలుగా గెలిస్తే బీసీలు అభివృద్ధి చెందుతారా.. మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీసీ గురుకులాలు పెట్టారా.. చట్ట సభల్లో అవకాశం లేకున్నా.. ఎమ్మెల్సీలుగా మేం అవకాశం ఇచ్చాం. ఎమ్మెల్సీలుగా బీసీ, ఎస్టీలకు అవకాశం ఇస్తే.. మీరు గవర్నర్‌ను అడ్డం పెట్టుకొని అడ్డుకున్నారు. మీరు గెలిచేదే ఐదు సీట్లు లేవు.. మీరు బీసీలకు సీట్లు ఇస్తే గెలుస్తారా.. నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే మీరు ఎందుకు ఓబీసీగా ఉన్న బండి సంజయ్‌ని మార్చి కిషన్ రెడ్డిని ఎలా అధ్యక్షుడిగా చేశారు. ఇలాగే గతంలో ఓ పెద్ద మనిషి పోతూ పోతూ.. బీసీని సీఎం చేస్తానని ప్రకటించి పోయారు.. ఏం జరిగింది. నేడు బీసీలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉన్నది. ఓడిపోయే స్థానాల్లో బీసీలను నిలబెట్టి ఓడించి.. మీరే ఓడించాలని .. బీసీలు ఓడిపోయారనే అపవాదు పెట్టాలని కుట్ర చేస్తున్నారు. మా పార్టీ సబ్బండ వర్గాలకు అండగా ఉంది. కాంట్రాక్టలలో.. వైన్ షాపుల్లో బీసీలకు బీఆర్ఎస్ పార్టీ రిజర్వేషన్ ఇచ్చింది" అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com